V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
19-08-2024

సంపుటి : 01 | సంచిక : 107 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## కోల్‌కతా హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు

- భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన ఇద్దరు న్యాయవాదులు
- ఆగస్టు 20న విచారించనున్న జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం



2

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారు

- యూపీఎస్సీకి బదులుగా ప్రత్యామ్నాయ మార్గంలో నియామకాలు చేపడుతున్నారు
- ఈ విధమైన భర్తీ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదు
- లేటరల్ ఎంట్రీ నియామకాల పద్ధతిపై రాహుల్ విమర్శలు



2



# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

### ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది

- సిటీ అభివృద్ధిలో క్షత్రియులూ భాగస్వాములే
- కఠోర శ్రమతోనే వివిధ రంగాల్లో రాణించారు
- ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు..
- రాజులను చట్ట సభల్లోకి తీసుకుంటాం..
- క్షత్రియ సేవాసమితి ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## మోదీపై రేవంత్ మరోసారి పరోక్ష ప్రశంసలు

ప్రధాని నరేంద్రమోదీని బడే బాయ్ అంటూ సంబోధించడం ద్వారా సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి మోదీపై పరోక్షంగా ప్రశంసలు కురిపించారు. 2

**విశ్వంభర, హైదరాబాద్ :**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని క్షత్రియులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారికి సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. క్షత్రియ భవన్‌కు కావాల్సిన స్థలం, అవసరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ అన్ని రంగాల అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. రాజులు ఏ రంగంలోనైనా రాణిస్తారని, ఇందుకు వారి శ్రమ, పట్టుదలే కారణమని చెప్పారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మిగతా2లో...

# హైడ్రా దూకుడు

- రాజకీయ ఒత్తిళ్లు వస్తున్న ఏమాత్రం తగ్గేది లేదంటూ ముందుకు
- శివారు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆపరేషన్
- గండిపేట్ చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో విలాసవంతమైన విల్లాలు నేలమట్టం
- యజమానులకు, హైడ్రా సిబ్బందికి మధ్య వాగ్వాదం
- త్వరలోనే మూసీ ఆక్రమణలపై కొరడా



**విశ్వంభర హైదరాబాద్:**

హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ట్రై సిటి పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ విపత్తుల నిర్మాణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై మరింత దూకుడు పెంచింది. శివారులలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే అక్రమ నిర్మాణాలను విల్లాలను నీలమట్టం చేసిన హైడ్రాకు రాజకీయ ఒత్తిళ్లు వస్తున్న ఏమాత్రం తగ్గేది లేదంటూ అక్రమ నిర్మాణాలపై ముందుకు సాగుతుంది. తాజాగా హైదరాబాద్ నగరవాసుల దాహార్తి తీర్చే రంగారెడ్డి జిల్లాలోని గండిపేట చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో మీ ఖానాపూర్ గ్రామంలో నిర్మించిన 16 అత్యంత విలాసవంతమైన విల్లాలను అపార్ట్మెంట్లను, హైడ్రా ఆదివారం ఉదయం తెల్లవారుజాము నుంచే కూల్చివేత పనులు చేపట్టింది. హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగినట్లు సమాచారం. పటిష్ట బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు మిగతా2లో...

## ప్రజల మద్దతు ఉంటే చాలు

- బీజేపీకి ఎవరి మద్దతు అవసరం లేదు
- 6 గ్యారెంటీలను పక్కదోవ పట్టించడానికే విలీన ప్రచారం
- రుణమాఫీపై రైతులు ఆందోళనలో ఉన్నారు
- అవినీతి, కుటుంబ పార్టీలకు బీజేపీ దూరం
- బీఆర్ఎస్ త్వరలోనే కాంగ్రెస్‌లో విలీనం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



2

# రైతులను నట్టేట ముంచారు

### తూతూ మంత్రంగా రుణమాఫీ

- లక్షల మంది రైతులు తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపైన ఆందోళనలు చేస్తున్నారు
- కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది
- రాహుల్ గాంధీ, ఖర్గేకు కేటీఆర్ లేఖ



2



ఒకే రోజు 15 పరిశ్రమలు

## ప్రారంభం

- నేడు శ్రీసిటీలో పర్యటించనున్న చంద్రబాబు
- వివిధ కంపెనీల సీఈవోలతో భేటీకానున్న ఏపీ సీఎం
- రూ.1,213 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోనున్న ప్రభుత్వం

2

# కులగణన చేసి తీరుతాం

### ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది
- సర్దార్ పాపన్న జీవితం ఆదర్శప్రాయం
- పాపన్న గౌడ్ పర్యాటక కేంద్రానికి రూ.4.70 కోట్లు
- జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఎన్నికల సమయంలో చెప్పినట్టుగానే కులగణన చేసి తీరుతామని.. దీనిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేసారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ పాపన్న గౌడ్ మహారాజ్ 374వ మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 90 | ₹ 112 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 162 | ₹ 185 |



యుగాలు గడిచినా వన్నె

## తరగనిది రక్షాబంధన్

### తెలుగు రాష్ట్రాల్లో రాఖీపౌర్ణమి శోభ

**విశ్వంభర, హైదరాబాద్:** తోడపుట్టిన సోదరికి జీవితాంతం కష్ట సుఖాల్లో తోడుంటానని సోదరుడు ఇచ్చే అభయమే రక్షాబంధన్. తరాలు మారినా, యుగాలు గడిచినా వన్నె తరగనిది రక్షాబంధన్. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగం, అప్యాయతకు ప్రతీకగా జరుపుకునే పండుగ రక్షాబంధన్. తోడపుట్టిన వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మిగతా3లో...

## మాటకు కట్టుబడి రుణమాఫీ

### ప్రతిపక్షాల రాజకీయ మనుగడకోసం పాట్లు

- అసత్య ప్రచారాలు మానుకోండి
- ప్రతి ఖాతాదారునికి అర్హతను బట్టి మాఫీ చేసే బాధ్యత మాది
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అరకొరగా అమలు
- ఇకనైనా హుందాగా ప్రవర్తించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2

భారత కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్

## కన్నుమూత



**చెన్నై:** భారత కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ (59) కన్నుమూశారు. గుండెపోటుకు గురైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కోస్ట్‌గార్డ్ సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు వచ్చిన పాల్.. తీవ్ర అసౌకర్యంతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. మిగతా3లో...

## ఒకే రోజు 15 పరిశ్రమలు ప్రారంభం

**విశ్వంభర, అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీలో పర్యటించన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. శ్రీసిటీలో 15 సంస్థల కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు మరో 7 సంస్థలకు శంకుస్థాపన చేస్తారు. శ్రీసిటీలో 00 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటయ్యే ఈ సంస్థల ద్వారా 2 వేల 740 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. మరో 1,213కోట్ల రూపాయలు పెట్టుబడులకు సంబంధించి నాలుగు ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది.అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో పలు కంపెనీల సీఈఓలతో సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. దక్షిణ కొరియాకు చెందిన ఎలికెమ్, ఇజ్రాయెల్‌కు చెందిన నియోలింక్, జపాన్‌కు చెందిన నైడిక్, ఓజేఐ ఇండియా ప్యాకేజ్, జర్మనీకి చెందిన బెల్ పరిశ్రమలతో పాటు భారత్‌కు చెందిన అడ్వైర్, ఆటోడేటా, బాంబేకోటెడ్ స్పెషల్ స్టీల్స్, ఈప్యాక్, ఇఎస్ఎస్కేఏవై, ఎవరైన్, జేజేఐ, త్రినాథ్, జెన్లెనిన్ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. చైనాకు చెందిన ఎన్సీసీ, బెల్జియంకు చెందిన వెర్మేరియన్, జపాన్‌కు చెందిన ఏజీ అండ్ పీ పరిశ్రమలకు శంకుస్థాపన చేయనున్నారు. జపాన్‌కు చెందిన రెండు పరిశ్రమలు, యూఏఈ, సింగపూర్లతో పాటు మనదేశానికి చెందిన ఒక్కో పరిశ్రమ ఏర్పాటుపై ఒప్పందాలు చేసుకోనున్నారు.

## మాటకు కట్టుబడి రుణమాఫీ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడి అమలు చేస్తున్న పథకాలతో ప్రజల్లో పార్టీ పట్ల పెరుగుతున్న నమ్మకం చూసి తమ రాజకీయ మనుగడ కాపాడు కొనేటందుకు పడ్తున్న పాట్లు చూసి జాలి వేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేసారు. గత నాలుగు రోజులనుండి రాష్ట్రములో ప్రతిపక్ష నేతలు అనేక విన్యాసాలు చేస్తూ, సోషల్ మీడియా సాక్షిగా, రైతాంగాన్ని తమ అసత్య ప్రచారాలతో ఆందోళనకు గురి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రుణమాఫీ పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్యప్రచారాన్ని తిప్పికొట్టారు. ఈ అంశంపై అయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ .. ఒకరేమో లక్ష మాఫీ చేయడానికే ఆపసోపాలు పడి, చివరికి సగం మందికి కూడా చెయ్యలేక రైతుల నమ్మకం కోల్పోయిన వారున్నారని తెలిపారు. ఇంకొకరు తాము అధికారంలో ఉన్న ఏ ఇతర రాష్ట్రం లోను ఇప్పటిదాకా రుణమాఫీ పథకం ఆలోచనే చెయ్యని వారు వీరిద్దరూ కలిసి , కాంగ్రెస్ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి పంట లోపే రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసి, ఇంకా ప్రక్రియ కొనసాగుతుండగానే, ఎటూ పాలుపోక కాంగ్రెస్ట్ ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. బ్యాంక్ లనుండి నుండి అందిన ప్రతి ఖాతాదారునికి వారి అర్హత బట్టి మాఫీ చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదని పునరుద్ఘాటించారు. ఇప్పటికి కేవలం రెండు లక్షల వరకు కుటుంబ నిర్ధారణ జరిగిన ఖాతాదారులందరికి పథకాన్ని వర్తింప చేసామని చెప్పిన తుమ్మల , 2 లక్షల లోపు మిగిలి ఉన్న ఖాతాలకు కుటుంబ నిర్ధారణ చేసి వారికి కూడా చెల్లిస్తామని తెలిపారు. 2 లక్షల పైన ఉన్న ఖాతాలకు , ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారు ముందు 2 లక్షల కంటే అదనంగా పొందిన రుణాన్ని చెల్లించిన పిదప , అర్హత బట్టి చెల్లిస్తామన్నారు. బ్యాంకర్లు నుండి వచ్చిన డేటా తప్పుగా వివరాలు ఉన్న రైతుల వివరాలను కూడా రైతుల వద్దనుండి సేకరిస్తున్నామని , రుణ మాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయాల్సిందిగా బ్యాంకర్ లను కోరామని తెలిపారు. అందరికి సమాచారం కోసం గత ప్రభుత్వ నిర్వాకాలు ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం గా రుణమాఫీ వివరాలు అందిస్తున్నామని స్పష్టం చేసారు. కనీసం గత ప్రభుత్వ పెద్దలు వారు అధికారంలో వున్నప్పుడు అరకొరగా అమలు చేసిన రుణమాఫీ తో ప్రయోజనం ఏ మేరకు జరిగిందో ఆత్మ పరిశీలన చేసుకొని, ఇకనైనా హుందాగా ప్రవర్తించి, ప్రజల్లో తమ స్థాయిని కాపాడు కోవాలని చురకలంటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి , రూ.31000 కోట్లు నిధులు కేటాయించుకొని, గత ప్రభుత్వ పెద్దల నిర్వాకం తో చిన్నాభిన్నం చేసిన ఆర్థిక పరిస్థితులు లోను, ఆగస్ట్ 15 లోపు రూ.18000 కోట్లతో రూ.2 లక్షల లోపు రుణ మాఫీ చేసిన ప్రభుత్వంతో సవాళ్ళా అని ప్రశ్నించారు.

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారు

**ఢిల్లీ:** ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో 'లేటరల్ ఎంట్రీ' పద్ధతిలో భర్తీలను కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. యూపీఎస్సీకి బదులుగా ప్రత్యామ్నాయ మార్గంలో నియామకాలు చేపడుతూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని కేంద్రంపై విమర్శలు గుప్పించారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉప కార్యదర్శులు/ డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ దరఖాస్తులను ఆహ్వానించిన వేళ రాహుల్ ఈమేరకు ట్వీట్ చేశారు. "కేంద్ర శాఖల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు చేపడుతూ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదు. దీన్ని మెరుగుపరిచే బదులు.. లేటరల్ ఎంట్రీ ద్వారా వారిని ఆ పదవులకు దూరం చేస్తున్నారు. యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులను కాజేస్తున్నారు. సామాజిక న్యాయాన్ని కాలరాస్తున్నారు. కీలకమైన ప్రభుత్వ పదవుల్లో చేరడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారనే దానికి ప్రధాన ఉదాహరణ సెబీనే. ఈ విధమైన భర్తీ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో కార్యదర్శులుగా, సంయుక్త, ఉప కార్యదర్శులుగా, డైరెక్టర్లుగా ప్రైవేటు రంగంలోని ప్రతిభావంతులను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. సాధారణంగా ఈ నాలుగు పోస్టులకు అఖిల భారత సర్వీసు అధికారులను, గ్రూప్ ఏ అధికారులను నియమిస్తుంటారు. కొత్త విధానంలో కాంట్రాక్టు పద్ధతిపై నియామకాలు జరుపుతోంది. 2018లో 10 మంది సంయుక్త కార్యదర్శుల నియామకం కోసం తొలిసారిగా యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది.

## దూకుడు పెంచిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)
ఆదివారం తెల్లవారుజామున ఖానాపూర్ కు చేరుకున్న ఈ వీడియో సిబ్బందిని యజమానులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చెలరేగి స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. దీంతో కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులను పోలీసుల అరెస్ట్ చేశారు. 5 రోజుల్లో ఆపరేషన్ గండిపేట పూర్తి చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నట్లు సమాచారం. అటు చిలుకూరు, ఇటు నార్సింగ్ మండలం ఖానాపూర్‌లో భారీ భవనాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి.

**త్వరలోనే మూసి కబ్జాలపై ఫోకస్..**
రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగే అందుబాటులోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మూసి నది ప్రక్షాళన సుందరీ కరణ పై ప్రత్యేక తెలిసిందే. 51 కిలోమీటర్ల మూసి పరివాహక ప్రాంతాన్ని ఎకలాజికల్, హెరిటేజ్ , టూరిజం మెట్రో అనే నాలుగు జోన్లుగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే డిపీఆర్ కు సిద్ధమైనట్లు సమాచారం. వర్ధమాన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్లో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ బోర్డుకు రూ.1000 కోట్లు కూడా సర్కార్ కేటాయించడంతో త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. గతంలోనే మూసీ నదిపై నిర్వహించిన డ్రోన్ సర్వేలో భాగంగా సుమారు పదివేల అక్రమ కట్టడాలను గుర్తించినట్లు సమాచారం. వీరిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ పునరావాసానికి కేటాయించి ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించేందుకు కూడా సర్కారు హైడ్రాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వచ్చేనెల రెండో వారంలో మూసీ ఆక్రమణలపై హైడ్రా కొరడా జుపించనున్నట్లు తెలుస్తోంది.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)
ఏర్పాటుచేసిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

**ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు..**
'సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి కృష్ణంరాజు. ఇప్పుడు హాలీవుడ్ తో పోటీ పడేలా రాణించిన బాహుబలి ప్రభాస్' అని అన్నారు. ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారన్నారు.ఈ సందర్భంగా దివంగత సినీనటుడు కృష్ణంరాజుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. "నాకంటే గొప్పవాళ్లు వేదిక ముందు వినయంగా ఉన్నారు. అదీ క్షత్రియుల గొప్పతనం, కొంపల్లిని పెద్ద నగరంగా చేసింది క్షత్రియులే. మీడియాలో కూడా రాజులే రాణిస్తున్నారు. వారు ఏ రంగంలోకి వచ్చినా రాణిస్తారు. కఠోరమైన శ్రమ, పట్టుదల కారణంగానే వివిధ రంగాల్లో క్షత్రియులు రాణించారని పేర్కొన్నారు.

**రాజులను చట్ట సభల్లోకి తీసుకుంటాం..**
రాజులను చట్ట సభల్లోకి తీసుకోవాలనే ఆలోచన ఉంది. తొలుత పార్టీలో అవకాశం ఇస్తాం.. తర్వాత ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తామని మాట ఇస్తున్నా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బోసురాజు అత్యంత క్రియాశీల పాత్ర పోషించారని అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేశారని, ఆయన కష్టాన్ని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించారని, వారి నిబద్ధతకు ప్రాధాన్యతనిస్తూ వారిని మంత్రిని చేశారని తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందనడానికి బోసురాజు, శ్రీనివాస వర్మ ఒక ఉదాహరణ అని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజులలో రాజకీయాల్లో రాణించాలని ఉన్నవాళ్లను మీరు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి కోరారు. వారికి తప్పకుండా అవకాశం కల్పిస్తామని క్షత్రియ సోదరులకు మాట ఇస్తున్నానని చెప్పారు. విశ్రాంత ఐఏఎస్ శ్రీనివాసరాజును ప్రభుత్వ సలహాదారుగా నియమించాం.. వారి ద్వారా మీరు నన్ను కలవొచ్చన్నారు. మీ సమస్యలను వారి ద్వారా నా దృష్టికి తీసుకురండి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కో చైర్మన్ గా శ్రీనివాసరాజును నియమించాం. ఇది క్షత్రియులపై మాకున్న నమ్మకానికి నిదర్శనం' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. అల్లూరి



సీతారామరాజు, కొమురం భీమ్ స్ఫూర్తితో తాము ప్రజా సమస్యలపై కొట్లాడామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియులు కూడా భాగస్వాములేనని, వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని చెబుతూ.. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని రాజులందరికి పిలుపునిచ్చారు.క్షత్రియ భవన్ కోసం తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుంది. మళ్లీ క్షత్రియ భవన్లో కలుద్దాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## కోల్‌కతా హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 20న ఈ కేసును విచారించనుంది.ఈనెల 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



**సుమోటోగా స్వీకరించాలని సుప్రీంకు న్యాయవాదుల లేఖ..**
**కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన కేసును సుమోటోగా స్వీకరించాలని కోరుతూ ఇద్దరు న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. కేసు విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం వెబ్సైట్లో పొందుపరిచింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఆగస్టు 20న హత్యాచార కేసును విచారించనుంది. ఈ కేసును కలకత్తా హైకోర్టు ఇప్పటికే సీబీఐకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడికి మానసిక సామర్థ్య పరీక్షలు నిర్వహించనుంది.**

**అప్రమత్తమైన బెంగాల్ పోలీసులు..**
కోల్‌కతా హత్యాచార ఘటనపై పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతుండటంపై బెంగాల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం కావటమే ఆందోళనలకు కారణమని భావిస్తున్న పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీతోపాటు ఇద్దరు వైద్యులు కునాల్ సర్కార్, సుబర్ణోగోస్వామికి సమన్లు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని సూచించారు.అనేక ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చిన డాక్టర్ గోస్వామి పోస్టుమార్టం నివేదికను చూసినట్లు చెప్పారు. అందులో విస్తుపోయే నిజాలు ఉన్నాయని తెలిపారు. మృతురాలి శరీరంలో 150 మిల్లీగ్రాముల వీర్యంతోపాటు కటి ఎముక విరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో ఉందన్నారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం ముమ్మాటికి మృతురాలిపై సామూహిక అత్యాచారం జరిగి ఉంటుందని డాక్టర్ గోస్వామి తెలిపారు. ఈ విషయాలను కోల్‌కతా పోలీసులు తోసిపుచ్చారు.

**ఆ విషయాలేం లేవ్!**
పోస్టుమార్టం నివేదికలో అలాంటి విషయాలేమీ లేవన్నారు పోలీసులు. ఇలాంటి అసత్యాలన్నీ సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం కావటం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. అలాంటి ప్రచారాలు నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవన్నారు. మృతురాలి పేరు, ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినందుకు బీజేపీ నాయకురాలు లాకెట్ ఛటర్జీని ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. పోలీస్ సమన్లపై స్పందించిన ఆమె, బాధితురాలికి న్యాయం చేయడంకంటే ప్రతిపక్ష నేతలు, ప్రజలు సామాజిక మాధ్యమాల్లో ఏం పోస్టులు పెడుతున్నారో చూడటానికే పోలీసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.

# కులగణన చేసి తీరుతాం

(మొదటి పేజీ తరువాయి)
జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2 లక్షల మంది గీత కార్మికులకు సేఫ్టీ కిట్లు అందించామన్నారు. సర్వాయి పాపన్న జీవితం మనందరికీ ఆదర్శం అని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా సర్వాయిపేట కోటను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కుల వృత్తుల శిక్షణకు స్కిల్ వర్సిటీలో స్థానం ఉంటుంది అని పొన్నం పేర్కొన్నారు. ప్రస్తుతం పొన్నం చేసిన వ్యాఖ్యలతో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా కనిపించడం లేదు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు సర్వాయి పాపన్న స్ఫూర్తి గాథలు తెలియాలన్నారు. ఆయన స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పాపన్న గౌడ్ పర్యాటక కేంద్రానికి రూ.4.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సర్దార్ పాపన్నజీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడారు. పాపన్న ఆశయాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం చెప్పారు. హైదరాబాద్ నగరంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాజ్యాంగం, చట్టాలు లేని సమయాల్లో సర్దార్ పాపన్న ప్రజల హక్కుల కోసం



పోరాడారని అన్నారు. పాపన్న గౌడ్ పర్యాటక కేంద్ర నిర్మాణ బాధ్యతలు మంత్రి పొన్నం ప్రభాకర్ చూసుకుంటారన్నారు. ముఖ్యంగా పాపన్న గురించి సులువుగా అర్థమయ్యేలా ప్రజలకు పాకెట్ పుస్తకాలను ముద్రిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యానికి సైతం సర్దార్ పాపన్న ఆలోచనలే మార్గదర్శకమని వెల్లించారు.కాగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ మేరకు బీసీ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని గౌడ సంఘాల సూచనలతో రవీంద్రభారతిలో నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించారు. ఇదిలా ఉండగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఒక సందేశం విడుదల చేశారు. అనంతరం ఆ మహావీరుడికి నివాళుర్పించారు. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదప్రజలను సంఘటితం చేశారన్నారు. రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరితం అసామాన్యమైందన్నారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తోందని సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## రైతులను నట్టేట ముంచారు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కి లేఖ రాసారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో చేసిన మోసంపైన కేటీఆర్ ఆదివారంలేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీ అందని లక్షలాదిమంది రైతుల తరపున ఈ లేఖ రాస్తున్నానని కేటీఆర్ తెలిపారు. సీఎం చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను కేటీఆర్ ఈ లేఖలో పొందుపరుస్తున్నట్లు వివరించారు. తెలంగాణలో వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకి రెండు రక్షల రుణమాఫీ హామీ ఇచ్చారు. కానీ, ఈ ప్రభుత్వం అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని తెలిపారు.40 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అని చెప్పి కేవలం 17 వేల కోట్లకు పైగా రుణమాఫీతో రైతులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రైతులందరికీ రుణమాఫీ చేయాలని కేటీఆర్ తన లేఖలో డిమాండ్ చేశారు. లక్షల మంది రైతులు ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపైన ఆందోళనలను చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి మాయ మాటలు చెప్పి తెలంగాణ రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరపున కాంగ్రెస్ పార్టీ పైన పోరాడుతామని తెలియజేశారు. కాగా, గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయింది. ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ది చేకూరింది. కాంగ్రెస్ చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెరగాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనం. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి తూతూమంత్రంగా చేయడం.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది అన్నారు.

## మోదీపై రేవంత్ మరోసారి పరోక్ష ప్రశంసలు

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రధాని నరేంద్రమోదీని బడే బాయ్ అంటూ సంబోధించడం ద్వారా సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి మోదీపై పరోక్షంగా ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్‌లో జరిగిన క్షత్రియ సేవా సమితి అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తను గుర్తించి నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు ప్రధాని మోదీ కేంద్రమంత్రి పదవి ఇచ్చారన్నారు. 30 ఏళ్లకు పైగా బీజేపీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తను కేంద్రమంత్రిని చేసిందంటూ ప్రశంసించారు. కేంద్రమాజీ మంత్రి కృష్ణంరాజుతో తనకు సన్నిహిత సంబంధం ఉందన్నారు. శ్రీనివాసవర్మ గురించి అప్పుడప్పుడు కృష్ణంరాజు తనతో ప్రస్తావించేవారన్నారు. గోదావరి జిల్లాల్లో ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లకు తీవ్ర పోటీ ఉంటుందని, పెట్టుబడి పెట్టేవారు టికెట్ల కోసం పోటీపడతారన్నారు. కానీ శ్రీనివాసవర్మ దగ్గర నిబద్ధత, శ్రమ ఉందని డబ్బులు మాత్రం లేవన్నారు. పార్టీ వేరైనా బీజేపీ శ్రీనివాసవర్మకు టికెట్ ఇచ్చిందన్నారు. టికెట్ ఇచ్చినా.. గెలవడం కష్టమని.. ప్రజలు గుర్తించి కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే నరేంద్రమోదీ శ్రీనివాసవర్మను మంత్రిని చేశారన్నారు.

## ప్రజల మద్దతు ఉంటే చాలు..



**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీకి ఎవరి మద్దతు అవసరం లేదని, ప్రజల మద్దతు ఉంటే చాలని బండి సంజయ్ తెలిపారు. 6 గ్యారెంటీలను పక్కదోవ పట్టించడానికే విలీన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీపై రైతులు ఆందోళనలో ఉన్నారని, రైతులకు బ్యాంకుల నుంచి ఎన్‌వోసీలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీజేపీ కొట్లాడుతుందని బండి సంజయ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ను భాజపాలో విలీనం చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అవినీతి, కుటుంబ పార్టీలకు బీజేపీ దూరమని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ ను ప్రజలు ఛీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రస్థానం కాంగ్రెస్‌తోనే మొదలైందని, బీఆర్ఎస్ త్వరలోనే కాంగ్రెస్‌లో విలీనం కాబోతుందన్నారు. అందుకే కొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ది యంగ్ మేన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ భవనాన్ని, స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. 150 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ సంస్థ, అనేక మంది మహనీయుల మార్గదర్శకంలో కొనసాగడం అభినందనీయమని బండి సంజయ్ అన్నారు. శ్యామ్ జీ నేతృత్వంలో ఈ భవనాన్ని ప్రారభించడం సంతోషంగా ఉందన్నారు. లక్ష్యం లేకుండా ఏ సంస్థ ముందుకు సాగదని, ఈ సంస్థకు మహోన్నత లక్ష్యం ఉందని వెల్లడించారు. క్లినిక్, లైబ్రరీ, సమావేశం మందిరం, శిక్షణ సేవా కార్యక్రమాల కోసం ఈ కేంద్రం ఉపయోగపడుతుందని బండి సంజయ్ తెలిపారు. గొప్ప వ్యక్తుల చరిత్రను గెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు భారత దేశంపై కుట్రలు చేస్తున్నాయని, దీన్ని ప్రధాని మోదీ సమర్థవంతంగా తిప్పికొడుతున్నారన్నారు. బంగ్లాదేశ్‌లో భారతీయులపై దాడులపై మాట్లాడుతున్న వారు, మొదట భవిష్యత్‌లో భారత్‌లో ఇలాంటి ఘటనలు ఏర్పడితే ఎలా ఎదుర్కోవాలో ఆలోచించాలని కోరారు. హిందు ధర్మం పరిరక్షణ కోసం ముందుకు రావాలని, గోహత్యలు, లవ్ జిహాదీలను నియంత్రించడం కోసం ఇలాంటి కేంద్రాలలో సమావేశాలు నిర్వహించాలని బండి సంజయ్ కోరారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- చైతన్యపురి ఎస్ఐ బద్రయ్య
- ప్రజలకు డ్రగ్స్, సైబర్ క్రైంలపై అవగాహన




**విశ్వంభర, చైతన్యపురి :** ప్రజలు సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బద్రయ్య సూచించారు. ఆదివారం చైతన్యపురిలో స్థానిక ప్రజలకు ఎస్ఐ బద్రయ్య ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని అన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అనవసర లింక్‌లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు, నష్టాలపై వివరించారు. గుర్తుతెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరం కృషి చేయాలన్నారు. డ్రగ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ సప్లై చేసినా, వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ సప్లైపై ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని చెప్పారు. సమాచారం అందిచిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ పట్ల పేరెంట్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో తేడాలు గమనిస్తే వెంటనే వారితో మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడి ఎందరో తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారని ఆవేదన చెందారు. డ్రగ్స్ కారణంగా వారి జీవితాలనే కాకుండా వారి కుటుంబాలను కూడా ఇబ్బందుల పాలు చేస్తున్నారని చెప్పారు. యాంటి డ్రగ్స్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దెబాధ్యత అందరిపై ఉందన్నారు. అందరి సహకారంతో ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో చైత్యన్యపురి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శేఖర్, మహేశ్‌కుమార్, ఉమెన్ పీసీ రమణ, మహేశ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ


**విశ్వంభర, కడ్తాల్ :** బహుజన విప్లవ యోధుడు, బహుజన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప చక్రవర్తి సర్దార్ పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని స్మరించుకున్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని సరికొండ గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ , రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్ , సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్ ,ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ , డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్చ నాయక్ , మాజీ ఎంపిటిసి పాలకుర్ల అద్దాల రాములు పాల్గొన్నారు.



**తలకొండపల్లిలో..**

తలకొండపల్లి మండల కేంద్రంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ , తాలూకా గౌడ సంఘము అధ్యక్షులు చుక్క అల్లాజీ గౌడ్ తెలంగాణ బహుజన చక్రవర్తి సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘము అధ్యక్షులు బత్తుల బాల కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్, అయిలి లక్ష్మి నారాయణ గౌడ్,తిరుమణి శేఖర్ గౌడ్ చుక్క నిరంజన్ గౌడ్ గంగ రవీందర్ గౌడ్ బీజేపీ మండల అధ్యక్షులు తిరుమని రవి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అనిల్, విష్ణు గౌడ్ శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రవీణ్ గౌడ్, బాలకృష్ణ గౌడ్, పండు గౌడ్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ సిటాడెల్ కన్వెన్షన్‌లో ఆదివారం నిఖిల్ వాసవిల వివాహానికి వి3 న్యూస్ చైర్మన్, విశ్వంభర దినపత్రిక సీఎండీ కాచం సత్యనారాయణ, సూర్యపేట్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పల్లె రవికుమార్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ రాంనర్సింహగుప్త, సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షుడు ఏ కృష్ణారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

- విశ్వంభర, శంషాబాద్

# తెలుగు కవయిత్రుల సమ్మేళనం ఆనందాన్నిచ్చింది



**విశ్వంభర, హైదరాబాద్:** 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన "తెలుగు కవయిత్రుల సమ్మేళనం" లో పాల్గొనడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని నేషనల్ బుక్ ట్రస్ట్ ఎడిటర్ బెంగళూరు తెలుగు విభాగం ప్రతిపాక మోహన్ తెలియజేశారు .ఈ సభలో రత్నా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్ పర్సన్ డాక్టర్ బి రత్నారెడ్డికి" జీవన సాఫల్య అవార్డుతో సత్కరించారు.

36 మంది కవయిత్రులు పాల్గొన్నారు. అందరికీ సర్టిఫికెట్ మెమెంటు లతో కార్యక్రమ నిర్వాహకులు గౌరవంగా సత్కరించారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన కవయిత్రుల సమ్మేళనాన్ని సభను విజయవంతం చేసినందుకు కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మన్ శ్రీ బొగ్గవరపు మాల్యాద్రి, అధ్యక్షులు మారంగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం వి లక్ష్మి, జనరల్ సెక్రెటరీ డాక్టర్ నరేంద్ర బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. బెంగళూరులోని తెలుగు సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనటం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలియజేశారు. ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించుటకు మాకు ప్రోత్సాహంగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

# యుగాలు గడిచినా వన్నె తరగనిది రక్షాబంధన్

(మొదటి పేజీ తరువాయి)

ఆశిస్తూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కాంక్షిస్తూ తోబుట్టువైన సోదరి సోదరుని చేతి మనికట్టుకు కట్టే రాఖీ ఎంతో విలువైనది. రాఖీ కట్టే సోదరిని సంతోష పెట్టేలా తోచిన మేరకు కానుకలు ఇస్తుంటారు అన్నదమ్ములు. అంతేగాక కష్ట సుఖాల్లో తోడుంటానని, ఆపదలో ఆదుకుంటానని అభయమిస్తుంటారు. పేగు బంధంతో పంచుకున్న అనుబంధాన్ని దారంతో ముడివేసి తోబుట్టువుగా గుర్తు చేసేదే రాఖీ పండుగ. నాటికీ, నేటికీ, ఏనాటికైనా ఇదే రక్షాబంధన్ పరమార్థం.

అలాంటి పర్వదినమైన రాఖీ పౌర్ణమిని తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుపుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రాఖీ పౌర్ణమి శోభ కనిపిస్తోంది. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఐదు రూపాయల నుంచి మూడు వేల దాకా అందంగా తీర్చిదిద్దిన రాఖీలు వినియోగదారుల్ని ఆకట్టుకుంటున్నాయి.

గతంలో దారంతో చేసిన దూది రాఖీలు విభిన్నమైన సైజుల్లో అందుబాటులో ఉండేవి. ఆ తరువాత చైన్ రాఖీలు ఆకట్టుకున్నాయి. రానురానూ కాలానుగుణంగా వివిధ డిజైన్లతో పాటు, దేవుళ్ల ఫొటోలతో రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో విభిన్న రాఖీలు కనువిందు చేస్తున్నాయి. వెండి, బంగారం పూసిన ఖరీదైన రాఖీలకు సైతం మంచి డిమాండ్ ఉంది. ప్రతిసారీలాగ కాకుండా ఈసారి విభిన్నంగా ఉండే రాఖీలను తమ సోదరులకు కట్టేందుకు సోదరీమణులు ఉత్సాహం చూపుతున్నారు. అందుకోసం ఖరీదైన రాఖీల కోసం యువతులు, మహిళలు దుకాణాల దగ్గర గంటల తరబడి అన్వేషిస్తున్నారు. దీంతో దుకాణాల దగ్గర సందడి వాతావరణం నెలకొంది.

కొత్త కొత్త డిజైన్లతో రాఖీలు..

విద్యా, ఉద్యోగ రీత్యా సుదూర ప్రాంతాల్లో ఉండే తమ సోదరుల కోసం కొరియర్, ఆన్ లైన్ మార్గాల్లో అక్కాచెల్లెళ్లు రాఖీలు పంపించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారులకు ఇష్టమైన పండుగల్లో ఒకటి రాఖీ పౌర్ణమి. ఆ రోజు అన్నాచెల్లెళ్లూ, అక్కాతమ్ముళ్లూ చేసే సందడి అంతా ఇంతా కాదు. మరి వారిని సైతం మనసు దోచుకునేలా వివిధ బొమ్మల రూపంలో కొత్త కొత్త డిజైన్లతో రాఖీలను విక్రయదారులు అందుబాటులో ఉంచారు. లైటింగ్ రాఖీలు, మోటుపత్లు, ఛోటా భీమ్, స్పైడర్ మెన్, కార్లు, బైక్లు వంటి రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సోదరులకు విభిన్నంగా ఉండే రాఖీలను కొనుగోలు చేసే సోదరీమణులు అదే విధంగా స్వీట్లలోనూ విభిన్నంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఇది గమనించిన వ్యాపారులు వారి అభిరుచుకి తగినట్లుగా వివిధ రకాల స్వీట్లు తయారు చేసి దుకాణాల్లో అందుబాటులో ఉంచారు.

# భారత కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్‌నాథ్ సింగ్.. ఆస్పత్రికి చేరుకుని పాల్కు నివాళులర్పించారు. ఆయన పార్థివదేహాన్ని దిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. రాకేశ్ పాల్ 34 ఏళ్లపాటు దేశానికి సేవలు అందించారు. కోస్ట్ గార్డ్ రీజియన్ (నార్త్ వెస్ట్) కమాండర్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (పాలసీ అండ్ ప్లాన్స్), దిల్లీలోని కోస్టార్డ్ ప్రధాన కార్యాలయంలో అదనపు డైరెక్టర్ జనరల్ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సమర్థ్, విజిత్, సుచేత కృపలానీ, అహల్యాబాయి, సీ03 తదితర భారత కోస్టార్డ్ నౌకలకు నేతృత్వం వహించారు. ఆయన పర్యవేక్షణలో ఐసీజీ అనేక ఆపరేషన్లు చేపట్టింది. పెద్దఎత్తున మాదకద్రవ్యాలు, రూ.కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. గత ఏడాది జులై 19న ఐసీజీ 25వ డైరెక్టర్ జనరల్ బాధ్యతలు చేపట్టారు.

# అటవీశాఖ చెట్ల లెక్కింపు

**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ కాళేశ్వరం 353 జాతీయ రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు రహదారికి ఒక వైపు ఉన్న చెట్ల లెక్కించి రహదారి కొలతలు చేస్తున్నారు. జాతీయ రహదారి అటవీ ప్రాంతం నుంచి వెళ్తుండగా రహదారికి ఒక వైపు ఎన్ని చెట్లు పోతాయో అంచనా వేస్తున్నారు. అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది కలిసి కుదురుపల్లి రహదారి అటవీ ప్రాంతం నుంచి కొలతలను ప్రారంభించారు. ఒక్కో చెట్టును కొలుస్తూ, వాటి విలువలను అంచనా వేస్తున్నారు.



# చిత్రం సజీవం.. పలు భావాల సమాహారం ఫొటోగ్రఫీ

## నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికి ఫొటో చూడగానే వెనక్కి వెళ్లి ఏండ్ల కింది మధురస్మృతులు మనసులో మెదలుతాయి. సంతోషం.. బాధలు.. మధుర ఘట్టాలు.. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు.. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. ఫొటోగ్రఫీ మాధ్యమంలో ఉన్న ఆవిష్కరణలు మరియు ప్రాముఖ్యతకు నివాళులర్పించేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. కాలంతో పాటే జ్ఞాపకం చెదిరిపోతుంది.. కానీ ఛాయాచిత్రంలో నిలిచిపోతుంది.. మనసు బాగాలేనప్పుడు ఫొటో ఆల్బమ్‌ను తిరిగేయండి చాలు. ఒక్కసారి మీ మూడ్ మారిపోతుంది. మధుర జ్ఞాపకాలు మీ ముందు కదలాడుతాయి. ఒక్కో ఫొటో ఒక్కో అనుభూతినిస్తుంది. నవ్వులు పూయిస్తుంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..

**నేడు ఫొటో లేని జీవితం ఊహించుకోలేం."**

చిత్రాలు తరచుగా పదాల కంటే బిగ్గరగా మాట్లాడే ప్రపంచంలో, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం అనేది కాలక్రమేణా క్షణాలను స్తంభింపజేసే కళ. "ఫొటోలు తీయించుకుంటే ఆయుర్దాయం తగ్గుతుందనే నమ్మకం మన దేశంలోనూ చాలాకాలం ఉండేది. మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటు లోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించే వారు. 1977 నుంచి ఫొటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్టమొదటి సారిగా లాలా దీనదయాళ్ ఫొటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫొటో లేని జీవితం ఊహించుకోలేం."

**కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫొటోగ్రఫీ..**

నాగరికంగా మనిషి ఎదగటం మొదలైన దశలో మానవుడికి తాను చూస్తున్న వాటిని వారసత్వ సంపదగా అందించాలనే కోరిక ఉండేది. కోరిక నుండి ఉద్భవించిన మహాద్భుతమే ఫొటోగ్రఫీ. ఎక్కడో రాతి గుహల గోడల మీద సూర్యకాంతి పడిన చోట నల్లగా మారటం గమనించి, కొన్ని రసాయ నాలు వెలుతురు పడిన మేర నల్లటి ఆకృతిని ఏర్పరుస్తాయన్న విషయం అర్థంచేసుకుని క్రమంగా ఫొటోగ్రఫీ ఆవిర్భావానికి బీజం వేసాడు మానవుడు. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫొటోగ్రఫీకి శతాబ్ధాల చరిత్ర ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు.

రెండు గ్రీకు పదాల కలయికే ఫొటోగ్రఫీ. "ఫోటో అంటే చిత్రం", "గ్రఫీ అంటే గీయడం" అని అర్థం. ఫొటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుకు తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాల క్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జే.ఎం.డాగ్యూరే 1837లో



ఫొటోగ్రఫీ ప్రాసెస్‌ను కనుగొన్నారు. 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యురే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది.

పూర్తి రూపం ఇచ్చి ఫొటోగ్రఫీ అనే ప్రక్రియను ప్రపంచానికి తెలియ జెప్పేందుకు ఆ తర్వాత మరో 280 సంవత్సరాలు పట్టింది. ఈ మధ్యలో ఎందరెందరో పరి శోధకులు ప్రయోగాత్మకంగా దృశ్యాన్ని లోహం మీద బంధించేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ చివరికి ఆ ఖ్యాతి దక్కింది ఎల్.జె.ఎల్. కు, 1837 ఫ్రెంచి ప్రభుత్వం అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ముందు డాగురే తాను కనుగొన్న ఒక కొత్త పరి కరాన్ని ప్రదర్శించాడు. బయటవున్న చిత్రాన్ని ఒక నల్లటి ఫలకంపై ముద్రించి, ఆ పైన దానిని ప్రాసెస్' చేసి ఆ చిత్రాన్ని శాశ్వతంగా ప్రదర్శించ గలిగినదే ఆ ప్రక్రియ. అది జరిగింది జనవరి 9, 1839. ఆ అద్భుత మైన ఆవిష్కారానికి హక్కులు పరిశోధకుడికి ఇచ్చారు.

అయితే ఇది ఒక వ్యక్తి హక్కు కాకూడదని భావించిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆ పాటోగ్రఫీ పేటెంట్ తాను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహుమతిగా ప్రకటించిన తేదీ ఆగష్టు 19, 1839. అలా ప్రపంచమంతా పోటోలు తీసుకునే హక్కును పొందిన ఆ తేదీని ప్రపంచ పాటోగ్రఫీ దినోత్సవంగా జరుపు కుంటారు. తొలిరోజుల్లో ఫొటోలు తీయించు కొనేందుకు మనుషులు భయపడే వారంటే నమ్మగలరా! తొలినాటి కెమెరా ఫొటో కావాలంటే దాని ఎదురుగా మనిషి 45 నిమిషాలపాటు కదలకుండా కూర్చోవాలి. అయితే ఆ ' రాకాసీ' (కెమెరా) మనిషి లోని శక్తిని లాగేస్తుందని, ఫొటో తీయించుకుంటే జీవ శక్తి తగ్గిపోయి త్వరగా మరణిస్తారని భావించి నాడు ప్రజలు భయంతో దూరంగా సాగి పోయారు. ఫొటోలు తీయించుకుంటే ఆయుర్దాయం తగ్గుతుందనే నమ్మకం మన దేశంలోనూ చాలాకాలం ఉండేది. మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. కేవలం బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని ఉపయోగించేవారు. 1977 నుంచి ఫొటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. భారత్‌లో మొట్టమొదటిసారిగా లాలా దీనదయాళ్ ఫొటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు. సమయం, సందర్భం ఏదైనా, నేడు ఫొటో లేని జీవితం ఊహించుకోలేం.

ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి, అంతిమ యాత్ర వరకు ప్రతి దశ కెమెరాతో బంధించాల్సిందే. ఇప్పుడు ప్రతి సెల్ ఫోన్ ఒక కెమెరా. సెల్ ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫిలో నైపుణ్యం పొందుతున్నారు. ఫొటోగ్రాఫర్ తీసే ఫొటో చూస్తే కలిగే ఆనందం వేరు. నలుపు తెలుపు అయినా, సప్త వర్ణాలతో తీసింది అయినా మనసును తట్టి తీరుతుంది. అలా ఆవిర్భవించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ఏ యేటి కాయేడు ఆదరణ పెరుగుతోంది. ఎందరెందరో కెమెరాతో ట్రిక్కులు చేస్తున్నారు. తమ సృజనను ప్రదర్శి స్తున్నారు. ప్రతి సంవత్సరపు ఫొటో గ్రాఫిక్ దినోత్సవం కొత్త కొత్తగా కొనసాగుతోంది. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఏటా నిర్వహి స్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా ఫొటో ప్రదర్శనతో పాటు, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీలలో గెలుపొందిన వారికి అవార్డులను ప్రధానం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

---

### పదవులకే వన్నె తెచ్చిన రాజకీయ దిగ్గజం


# శంకర్ దయాళ్ శర్మ

## నేడు ఆయన జయంతి

శంకర్ దయాళ్ శర్మ ప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఒక ప్రముఖ న్యాయవాది, రాజకీయవేత్త, అసాధారణమైన విద్యార్హతలు కలిగిన పండితులు. .భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులలో ఆయన ఒకరు. ఆయన భారత క్రియాశీల రాజకీయాలలో విశేష అనుభవం కలిగి, ఎన్నో ఉన్నత స్థానాలను నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో మంత్రిగా, రాష్ట్ర కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా, రాష్ట్రాల గవర్నరుగా, దేశ ఉప రాష్ట్రపతిగా, సర్వోన్నత పదవి రాష్ట్రపతిగా విధులు నిర్వహించిన విశేష అనుభవ శాలి. 1940 లలో తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.1940 వ దశకంలో శర్మ భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అదే దశకంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరి చివరి వరకూ అదే పార్టీకి విధేయులుగా ఉన్నారు. 1942 లో జరిగిన చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమంలో, స్వదేశీ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనడం ప్రారంభించిన వెంటనే శంకర్ దయాళ్ శర్మ కాంగ్రెస్ జాతీయ కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాట కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు.

భోపాల్ నగరంలో 1918, ఆగస్టు 19న జన్మించిన శర్మ సెయింట్ జాన్ కళాశాల, ఆగ్రా కళాశాల, అలహాబాద్ విశ్వ విద్యాలయం, లక్నో విశ్వ విద్యాలయం, ఫిట్జ్ విలియం కళాశాల, కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం, లింకన్స్ ఇన్, హార్వర్డ్ న్యాయ పాఠశాల మొదలైన అనేక విద్యా సంస్థల్లో విద్య నభ్యసించారు. శర్మ లక్నో విశ్వ విద్యాలయంలో 9 సంవత్సరాలు న్యాయ శాస్త్రాన్ని బోధించారు. తరువాత కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్రాన్ని బోధించారు. శర్మ 1992 నుండి 1997 వరకు రాష్ట్రపతిగా, 1987 నుండి 1992 వరకు రామస్వామి వెంకటరామన్ రాష్ట్రపతిగా ఉన్నపుడు, ఉప రాష్ట్రపతిగా పనిచేసారు. అంతకు పూర్వం 1950 నుండి 1952 వరకు భోపాల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఉన్నారు.1952 లో అప్పటి భోపాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారి. 1956లో భోపాల్ మిగతా చిన్న రాష్ట్రాలతో కలిసి మధ్యప్రదేశ్ ఏర్పడేవరకూ ముఖ్యమంత్రిగా పనిచేశారు. విద్యా శాఖ, న్యాయ శాఖ మొదలైన అనేక శాఖల్లో కేంద్ర మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా పనిచేసారు.1960లలో ఇందిరా గాంధీ బలమైన మద్దతు దారుగా, ఆమె కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడాన్ని సమర్థించారు. ఆమె ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో అనేక మంత్రి పదవులు నిర్వహించారు. 1972-74 మధ్యలో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు.1974-77 మధ్యలో కమ్యూనికేషన్ల శాఖా మంత్రిగా పనిచేశారు.1984 లో



ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు . పంజాబ్‌లో ఎన్నికల తర్వాత, 1985 లో శర్మ పంజాబ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. న్యాయవాద వృత్తిలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ సంఘం నుండి లివింగ్ లెజెండ్స్ ఆఫ్ ది లా అవార్డును అందుకున్నారు. ఆయన జీవిత చరమాంకంలో తీవ్ర అనారోగ్యానికి గురై, 1999 అక్టోబరు 9 న విపరీతమైన గుండెపోటుతో ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని విజయ్ ఘాట్ వద్ద ఖననం చేశారు.

---

# నిరుద్యోగుల ఆశల వారధి శ్రీనివాసా చారి

"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు, తరతరాలకి తరగని వెలుగవుతారు" అన్న పదాలకు నిలువెత్తు అక్షర రూపం "డాక్టర్.ఇడికోజు శ్రీనివాస చారి సార్ ". అమ్మ భాషను అమృతతుల్యం చేస్తూ తరగని గని లాంటి తెలుగు భాషా సాహిత్యాలను బోధిస్తూ రాబోవు తరాల కోసం బలమైన పునాదులు నిర్మించే ఉపాధ్యాయులను తయారు చేసే ఒక భాషా కర్మాగారం. పాఠశాల నుంచి మొదలుకొని విశ్వవిద్యాలయాల స్థాయి వరకు తెలుగు పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి తాను బోధించే పాఠాల ద్వారా భవిష్యత్తు గురువులను తయారు చేసే యజ్ఞంలో నిరంతరాయంగా శ్రమిస్తూ, నిరుద్యోగుల ఆశల వారధి, UGC NET /JRF , TS /AP SET, C-TET , AP /TS TET , DSC, JL , DL పరీక్షలు, ఇటీవల ప్రకటించిన గురుకుల టీచర్ల ఫలితాలలో ఎందరో నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించడం లో డా. ఇడికోజు శ్రీనివాసా చారి సార్ పాత్ర ఎనలేనిది. వారిజీవితం గురించి తెలుసుకుందాం.

**బాల్యం, విద్యాభ్యాసం :**

డాక్టర్ ఇడికోజు శ్రీనివాసా చారి జన్మస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం కేంద్రంలోని ఒక మధ్య తరగతి విశ్వబ్రాహ్మణ (కమ్మరి) కుటుంబంలో ఇడికోజు పెద నారాయణ, నారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం సమయంలోనే తన తండ్రి మరణించగా తన అన్న, వదిన వెంకటా చారి, సుధారాణిల ప్రోత్సాహంతో తన చదువును కొనసాగించారు. ప్రాథమిక విద్యను చండూరులో పూర్తిచేసి, కళాశాల విద్యను నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్జీ కళాశాలలో పూర్తి చేశారు. గణిత విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత తెలుగు భాషా సాహిత్యాలపైన అమితమైన అభిమానాన్ని పెంచుకొని తన గురువులు ఏనుగు ప్రదీప్ రెడ్డి గారు, బొడ్డోజు మల్లాచారి గార్ల ప్రోత్సాహంతో భారతదేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తొలి అడుగు పడింది.2011 సంవత్సరంలో ఎం.ఏ తెలుగు చదువుకొని UGC-NET & JRF సాధించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో Ph.D సీటు పొందారు. "నల్లగొండ జిల్లా ప్రాచీన కవిత్వం - పరిశీలన అనే అంశం పైన డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తిచేసి ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖకు సమర్పించి డాక్టరేట్ పట్టాను పొందారు.

తెలుగు భాషా సాహిత్యాలు అంటే ఎనలేని ఇష్టంతో అనేక జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సదస్సులలో తన పరిశోధన పత్రాలను సమర్పించారు. ఎన్నో కవి సమ్మేళనాలకు సమన్వయకర్తగా పాల్గొని, నిర్వహించడం



జరిగింది. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తరుపున క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొన్నారు. తెలుగు సాహిత్యం బలోపేతం చేసే క్రమంలో తన సొంత జిల్లా నల్లగొండ జిల్లా కేంద్రంలో నెలకొని ఉన్న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో M.A తెలుగు కోర్సును ప్రవేశపెట్టడానికి చేసిన ప్రయత్నాలలో తను కూడా కొన్ని ప్రతిపాదనలను పత్రికాముఖంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవలను గుర్తించి మదర్ తెరిసా ఉత్తమ సేవ పురస్కారం -2018,విశ్వకర్మ లెజెండరీ అవార్డు- 2019,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు- 2019,ఇలాంటి ఎన్నో సాహిత్య పురస్కారాలను పొందారు. తెలంగాణ ప్రభుత్వం TREIRB బోర్డు వారు నిర్వహించిన గురుకుల టీచర్స్ పోటీ పరీక్షలలో తొలుత PGT తెలుగు టీచరు గా ఉద్యోగాన్ని పొంది, తదనంతర కాలంలో గురుకుల JL( జూనియర్ లెక్చరర్) గా రాష్ట్రంలోనే 3వ ర్యాంకు ర్యాంకును పొంది మైనార్టీ గురుకులాలలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సొంతం చేసుకొని ప్రస్తుతం హయత్ నగర్లోని అంబర్ పేట మైనార్టీ గురుకుల కళాశాలలో ఉద్యోగ విధులు నిర్వర్తిస్తు, ఉద్యోగుల సంక్షేమం కోసం, హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు.

**పోటీ పరీక్షలకు శిక్షకునిగా ప్రస్థానం:**

తెలుగు భాషా సాహిత్యాలు చదువుకొని ఉద్యోగం పొందిన తనను పోటీ పరీక్షల రంగంలోకి పరిచయం చేసిన వారు సైకాలజీ లెక్చరర్ పంతులు మధుబాబు సార్. ప్రభుత్వ ఉద్యోగము పొందడానికంటే ముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అనేక పోటీ పరీక్షల శిక్షణ సంస్థలలో తెలుగు సాహిత్య పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే ఎంతోమంది ఎంతోమంది నిరుద్యోగులకు శిక్షణా తరగతులలో తెలుగును బోధించేవారు. తన విద్యార్థులను గెలిపించాలని నిత్యం ఎంతో తపన పడేవారు.అందుకు అనుగుణంగా ఎన్నో గ్రంథాలను చదివి నాణ్యమైన సమాచారాన్ని సేకరించి తన విద్యార్థులకు బోధించి వారు విజయం సాధించడంలో కీలకపాత్రను పోషించేవారు.

నిరుద్యోగి బాధ మరో నిరుద్యోగికి తెలిసినట్లు తాను నిరుద్యోగిగా ఉన్న సమయంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు కాబట్టే తన విద్యార్థులు అలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకుండా ఉద్యోగాలు సాధించాలని, నిరంతరం వారిలో స్ఫూర్తిని నింపే విధంగా పాఠాలు బోధించడంలో ఎంతో నైపుణ్యాన్ని సాధించారు. టెట్, సెట్, యుజిసి నెట్, జెఆర్‌ఎఫ్ వంటి అర్హత పరీక్షలలో ప్రశ్నల సరళికి తగ్గట్టుగా పాఠం చెప్పి ఎందరో విద్యార్థులను విజయం సాధించేలా శిక్షణ ఇచ్చారు. ఉదాహరణకు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము TREIRB విడుదల చేసిన గురుకుల టీచర్స్ నియామక ఫలితాలలో DL, JL, PGT, TGT వంటి పరీక్షలలో ఎంపికైన టీచర్ అభ్యర్థులు ఎక్కువ శాతం డా.ఇడికోజు శ్రీనివాస చారి సార్ శిష్యులే ఉండటము సంతోషకరమైన విషయం. పోటీ పరీక్షలలో తన విద్యార్థులకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించి వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపుతూ, పరీక్షకు విద్యార్థికి ఎంత మేరకు సమాచారం అవసరమో అందుకు తగిన విధంగా సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించి, విశ్లేషించి అర్థమయ్యేలా వివరించేవారు. ఒకవేళ ఏమైనా అర్థం కాని కఠినమైన సమాచారం ఉంటే సులభంగా గుర్తుంచుకునే విధంగా కోడ్ చేసి తనదైన శైలిలో బోధించి విద్యార్థులు విజయం సాధించడానికి ఎంతో కృషి చేస్తారు.

ఇప్పటివరకు జరిగిన తెలుగు పోటీ పరీక్షల నేపథ్యాన్ని పరిశీలించి చూసినట్లయితే తెలుగు భాషకు సంబంధించిన ఏ పోటీ పరీక్ష జరిగిన గాని గత ప్రశ్నా పత్రాల విశ్లేషణ అనేది బహుశా ఇప్పటివరకు భారతదేశం మొత్తం మీద చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి డా.ఇడికోజు శ్రీనివాసచారి సారు మాత్రమే అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు సాహిత్యాన్ని బోధించడానికి అందుకు అవసరమైన సాంకేతికతను జోడించి వినూత్న పద్ధతిలో బోధించి వీడియోలను భద్రపరిచి TSV ( తెలుగు సాహితీ వీచిక ) అని యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా వీక్షించుకోవడానికి అందుబాటులో ఉంచారు. అదేవిధంగా TLG ( తెలుగు లాంగ్వేజ్ గ్రామర్ ) అని ఒక మొబైల్ యాప్ ను క్రియేట్ చేసి తాను బోధించిన తెలుగు సాహిత్యానికి సంబంధించిన వీడియోలను మొత్తం భద్రపరిచి నిరుద్యోగ విద్యార్థులకు అన్ని వీడియో పాఠాలను వినే విధంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ లో ప్రభుత్వము ముద్రించిన పుస్తకాలు పిడిఎఫ్ రూపంలో ఉంచారు.అదేవిధంగా వివిధ విశ్వవిద్యాలయాల స్థాయిలో నిర్వహించిన ప్రశ్నాపత్రాలు, ఇప్పటివరకు అనేక రకమైన పోటీ పరీక్షల కోసము నిర్వహించిన ప్రశ్నాపత్రాలు అన్నింటిని అందుబాటులోకి తెచ్చారు.

తెలుగు పోటీ పరీక్షా ప్రపంచంలో నిరుద్యోగ అభ్యర్థులను, వారి జీవితాలను అగ్రగామిగా నిలిపేందుకు అనుక్షణం పరితపిస్తూ, ఉద్యోగార్థుల కలలను సాకారం చేయడానికి తాను మండే కొవ్వొత్తిలా వెలుగుతూ జ్ఞాన జ్యోతిని ప్రతినిత్యం ప్రసరింపచేస్తూ విద్యార్థుల విజయంతో తన శ్రమను మరిచిపోయే అరుదైన పంతులయ్య మా చారి సార్. మనం గెలుస్తూ ఎదుటివారిని సైతం గెలిపిస్తే వచ్చే( కిక్కు ) అంతటి ఆనందాన్ని ఈ సృష్టిలో ఏది ఇవ్వలేదు అని బలంగా నమ్మిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించబోయే విద్యార్థుల పెదాలపై చిరునవ్వులా మెరుస్తూ ఉండిపోవాలని కోరుకుంటూ...



- పల్లె సతీష్
తెలుగు పరిశోధక విద్యార్థి
ఉస్మానియా విశ్వ విద్యాలయం



## సుప్రీం కోర్టు వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా భారత్ బంద్ కరపత్రాల ఆవిష్కరణ

**విశ్వంభర, భద్రాచలం :** సుప్రీం కోర్టు వర్గీకరణ తీర్పు కు వ్యతిరేకంగా ఈ నెల 21 వ తేదీన జరగబోవు భారత్ బంద్ కరపత్రాలను భద్రాచలం నియోజకవర్గ స్థానిక శాసన సభ్యులు తెల్లం వెంకట్రావ్ విడుదల చేశారు. ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ 21 వ తేదీన జరగబోవు భారత్ బంద్ కు రవాణా వ్యాపార విద్య సంస్థలు ప్రజలు స్వచ్ఛందంగా ఈ యొక్క బంద్ కు సహకరించాలి అని మాల మేధావులు, మాల ఉద్యోగులు మాల విద్యార్థులు బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బర్ల రామకృష్ణ, పల్లంటి వెంకన్న , డేగల శివయ్య ,సతీష్, అల్లాడి సంతోష్, నక్క సందీప్, వలపర్ల విక్రమ్, కొత్త ప్రవీణ్, పెరమల్ల సురేష్,రవి, నాని, బన్నీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:**తెలంగాణ ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు . పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సరూర్ నగర్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదప్రజలను సంఘటితం చేసి, రాజకీయసామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరితం అసామాన్యమైనదని అని అన్నారు.సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితో ప్రజాప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తోందని తెలిపారు...
ఈ కార్యక్రమంలో మహేందర్ యాదవ్, రాష్ట్ర యువజన నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్,గౌడ సంఘం సెక్రెటరీ కందికంటి శ్రీధర్ గౌడ్, రాజు గౌడ్, జంగారెడ్డి, విజయ్,కళ్యాణ్ యాదవ్, నబీ కుమార్, సాయి ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూర్ఖపు నిర్ణయాలు విరమించుకోవాలి



### మాజీ చైర్మన్ రామ్ నర్సింహా గౌడ్ డిమాండ్

**విశ్వంభర, ఎల్బీనగర్:**బీసీ కుల గణనా జరపాలని స్థానిక సంస్థలలో 42%రిజర్వేషన్స్ కల్పించాలి అని గత రెండు రోజులుగా చేస్తున్న హస్తినపురం చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం దగ్యారా బీసీల పోరు దీక్షకు భారస పార్టీ రాష్ట్ర నాయకుడు, గడ్డిఅన్నారం వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్ మద్దతూ తెలిపారు.ఈ సందర్భంగా రామ్ నర్సింహా గౌడ్ మాట్లాడుతు అమలకు సాధ్యం కానీ హామీలతో రాష్టంలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని, బడుగు,బలహీన వర్గాలకు రాజకీయంగా తీవ్ర అన్యాయం చేస్తున్నది అని అయన విమర్శలు చేశారు.
ఈ కార్యక్రమంలో రామ్ కోటి ముదిరాజ్, ఆనంతుల రామ్ మూర్తి గౌడ్, కోట్ల వాసుదేవ్,ముద్దగోని సతీష్ గౌడ్, బొంగు ప్రసాద్ గౌడ్,కరుణశ్రీ,సూర్గి మహేష్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లింగోజి గూడలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు



**విశ్వంభర, లింగోజిగూడ :**లింగోజిగూడలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తొలి తరం వీర యోధుడు పాపన్న అని దేశం గౌరవించే గొప్ప నాయకుడు అని అన్నారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి,గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్, కోశాధికారి నాగ భూషణం,అధ్యక్షుడు దయానంద్ స్వామీ గౌడ్,కార్యదర్శి కందికంటి శ్రీధర్ గౌడ్, జె.చంద్ర మోహన్ గౌడ్,ప్రవీణ్ కుమార్ , డి ఆనంద్ కుమార్, ఏ. ప్రవీణ్,నగేష్, రవి శంకర్, ప్రేమ్ నాథ్ గౌడ్,పండరీనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

## ఘట్కేసర్ లో ఘనంగా బోనాలు



**విశ్వంభర, ఘట్కేసర్ :** బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకలని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధి పలు వార్డుల్లో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మంజూరు

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)ఆదివారం రోజు ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బిఆరెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్&టెస్కేబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి సహకారంతో ఆత్మకూరు(ఎం) మండల కేంద్రములో నూతనంగా నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. గొంగిడి మహేందర్ రెడ్డి నల్లగొండ జిల్లా పరిధిలో సహకార బ్యాంకులను పటిష్టం చేసి అభివృద్ధి పరిచిన ఘనత వారిది అని, ఆనాడు బిఆరెస్ పార్టీ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటూ రైతులకు ఎంతో మేలు చేస్తే, ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పూర్తిగా రైతులను మోసం చేసిందని అన్నారు. 2లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పటికి చాలా మంది రైతులకు ఋణాలు మాఫీ కానీ పరిస్థితులు ఉన్నాయి అని రానున్న రోజుల్లో ఇచ్చిన హామీ ప్రకారం అందరకీ మాఫీ రాకపోతే పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రభుత్వంపైన ప్రతి గ్రామంలోను,మండల కేంద్రంలో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ బిఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్,సీనియర్ నాయకులు కోరే భిక్షపతి, తాజా మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు లాగ్గాని రమేష్ గౌడ్,గ్రామశాఖ అధ్యక్షులు కోరే వెంకన్న, మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి , మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ అజ్జిముద్దీన్, నాయకులు నాతి రాజు గౌడ్,పరకాల నర్సయ్య గౌడ్ , మాద సత్తయ్య, బొడిగే వెంకటయ్య, అబ్బాసాయిలు, సోలిపురం ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అడ్వకేట్ పై దాడి చేసిన ఎస్ఐ జమాల్‌ను సస్పెండ్ చేయాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** నగరంలోని బోరబండకు చెందిన న్యాయవాది సంతోషకుమార్ పై అకారణంగా దౌర్జన్యంచేసి, తీవ్ర పరుష పదజాలంతో దాడి చేసిన ఎస్ ఐ జమాల్ ను సస్పెండ్ చేయాలని, బాధితుడికి పరిహారం చెల్లించాలని కూకట్పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి రమేశ్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూకట్ పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న పి.సంతోష్ కుమార్ ఇంటికి ఈ నెల 16 తెల్లవారుజామున ఎస్ఐ జమాల్ తన సిబ్బందితో గేట్లు తన్నుకొంటూ వచ్చి అతనిపై దుర్భాషలాడుతూ దాడి చేయడం హేయమని చర్య అని పేర్కొన్నారు. తాను ఇంటి యజమానిని కాదని, తానొక న్యాయవాది అని, ఈ ఇంట్లో కిరాయికి ఉంటున్నానని చెప్పినా వినకుండా కట్టబట్టలతో పోలీస్టేషన్ కు ఈడ్చుకెళ్లారని తెలిపారు. ఈ ఘటనపై నగర సిపి శ్రీనివాస్ రెడ్డి కి ఈ నెల 17న ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.గతంలో జనగామలో అడ్వకేట్ భార్యాభర్తలు, నిన్న సంతోష్ వంటి న్యాయవాదులపై రోజు కురోజుకు నాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణకొరకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయవాది సంతోష్ కు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఉభయ తెలుగు రాష్ట్రాల న్యాయవాద సంఘాలు కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదుల పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలంగాణ అడ్వకేట్ జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేశ్ గౌడ్ ప్రకటించారు. సమావేశంలో న్యాయవాదులు తెలంగాణ అడ్వకేట్ జేఏసీ అధ్యక్షులు పిబి ప్రకాశ్ యాదవ్, బత్తుల క్రిష్ణ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థిని హత్య పై సమగ్ర విచారణ జరిపించాలి




**విశ్వంభర,భద్రాద్రి కొత్తగూడెం :** చర్ల అంబేద్కర్ సెంటర్ లో ప్రజలు ప్రజాస్వానికి వాదులు అని, విద్యార్థులు యువత యావత్తు సమాజం మొత్తం కూడా మెడికల్ విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాలని అన్నారు. మెడికల్ విద్యార్థిని పై అత్యాచారం చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని తద్వారా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు న్యాయస్థానాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో కులం మతం ప్రాంతం వయస్సుతో సంబంధం లేకుండా మహిళలపై జరుగుతున్న దాడులు అత్యంత బాధాకరం అని అన్నారు. ఈ దాడులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించడం స్పందించకపోవడం మహిళలకు రక్షణ కల్పించకపోవడం మహిళలకు తరపున నిలబడకపోవడం అత్యంత దుర్మార్గం అని అన్నారు. మరణించిన మెడికల్ విద్యార్థిని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని అన్నారు. వైద్య విద్యార్థిని హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఈ హత్యలో ఈ హత్యాచారంలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని ఎవ్వరిని విడిచిపెట్టకుండా కఠినాతి కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.



**భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గోల్నాక డివిజన్ కన్వీనర్ గా వరికుప్పల హరి, కో కన్వీనర్లుగా కే శ్రీకాంత్, ఎం అరుణ్ కుమార్, కె కృష్ణ లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్పేట్ అసెంబ్లీ కన్వీనర్ జి ఆనంద్ గౌడ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గోల్నాక డివిజన్ భాజపా అధ్యక్షులు మూల రవీందర్ గౌడ్ , కేసరి నర్సింగరావు యాదవ్ , భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్పేట కో-కన్వీనర్ శ్రీధర్ గౌడ్ , రాజేష్, M. శంకర్, రాజు, సతీష్, నరేష్, రాజశేఖర్ రెడ్డి, బసవరాజ్, శ్రీనివాస్, జగదీష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.**

**- విశ్వంభర, హైద్రాబాద్**

## సర్వాయి పాపన్నకు కోరుట్ల ఎమ్మెల్యే నివాళి



**విశ్వంభర, కోరుట్ల :** మల్లాపూర్ మండలంలోని సిర్పూర్ గ్రామంలో బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఎమ్మెల్యే కల్వకుంట సంజయ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబుల ను తరిమి కొట్టిన గొప్ప యుద్ధ వీరుడు అని గొరిల్లా యుద్ధ వ్యూహంతో గొల్ల కొండను స్వాధీనం చేసుకుని సాటిలేని యుద్ధ నైపుణ్యంతో చత్రపతి శివాజీ మహారాజ్ వలె మొఘల్ చక్రవర్తులను గడగడ వనికించిన గొప్ప వీరుడని బహుజనులకు ఆదర్శప్రాయుడు అని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు నివాళులు అర్పించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 20న బీసీ సంఘాల కార్యాచరణ



**విశ్వంభర, కల్వకుర్తి :** తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన, వచ్చే స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపుకు సంబంధించి కల్వకుర్తి పట్టణం UTF భవన్ లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని కొమ్మగోని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కావున పార్టీలకతీతంగా బీసీ బంధువులు,అందరూ హాజరై తమ యొక్క విలువైన సూచనలు, సలహాలు, బీసీ ఉద్యమ నిర్మాణం, కల్వకుర్తిలో బీసీ వాదం బలంగా నిర్మాణం చేయుటకు. మీ అభిప్రాయం తెలియజేస్తూ బీసీ ఉద్యమానికి మీ వంతు పూర్తి సహకారం అందించాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గం లో ఉండే అన్ని బీసీ సంఘాలకు కుల సంఘాలకు కల్వకుర్తి నియోజకవర్గంలో వివిధ పార్టీలలో ఉండే బీసీ నాయకుల అందరికీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం అని తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్య నాయక్, సినీయర్ నాయకులు ఉప్పల రాములు, గుత్తి బాలస్వామి,పాపి శెట్టి రాము,మాజీ ఎంపిటిసి చందు నాయక్, మాజీ వార్డు నెంబర్ వస్పుల సాయిలు, డేరంగుల వెంకటేష్, పూసల భాస్కర్, వడ్డేమోని శివకుమార్, లండం యాదయ్య, మద్దూరి ఆనంద్, దేవేందర్,రంజిత్,మహేష్,అల్లజీ,గిరి తది తరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ



**విశ్వంభర, నారాయణపూర్ :** మండల కేంద్రానికి చెందిన శికిలమెట్ల శారదకు ఒక్కగానొక్క కూతురు సుమతేజ పుట్టుకతోనే మానసిక వికలాంగురాలు. 12 నెలల క్రితం శారద భర్త చనిపోవడంతో కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చింది. ఇటీవలే శారద కుడా అనారోగ్యానికి గురై మృతి చెందింది. దీంతో చిన్నారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం వృద్ధురాలైన అమ్మమ్మ వద్ద ఉంటుంది. సామాజిక మాధ్యమాల ద్వారా వీరి పరిస్థితి తెలుసుకున్న సత్య చారిటబుల్ ట్రస్ట్ స్థాపకులు మానస నాంపల్లి మండల ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త గిరిజ మహేష్ ఆధ్వర్యంలో 5000 విలువ గల నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. మానవతావాదులు ఈ అభాగ్యులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త మహేష్, జక్కిడి సుదర్శన్ రెడ్డి, గంగపురం సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



**విశ్వంభర, భూపాలపల్లి ;**

తెలంగాణ ప్రాంత బహుజన సామాజిక వర్గాల విముక్తి కొరకు పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం ఆయన 374వ జయంతి సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కట్ చేసి గౌడన్నలకు తినిపించారు. అనంతరం కలెక్టరేట్ లోని ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం అక్కడ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ మొఘుల్ చక్రవర్తుల అరాచక పాలనను ఎదురించి నిలిచిన గొప్ప ధీరుడని అన్నారు. భూస్వామ్యులు, పెత్తందారులను ఎదురించి, బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. వారి గొప్పతనం నేటి యువతరానికి తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆనాటి వీరుల పోరాట స్ఫూర్తితో, సమసమాజ స్థాపనకు అందరూ కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ నేతలు, అధికారులు, కార్యకర్తలు ఉన్నారు.

**పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు**

స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా దమ్మన్నపేట గ్రామ గౌడ సంఘం నేతలు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.

## మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డికి నివాళులు



**విశ్వంభర, కల్వకుర్తి :** మాజీ ఎమ్మెల్యే కీ "శే ఎడమ కిష్టారెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా కిష్టా రెడ్డి అభిమానులు మహబూబ్నగర్ చౌరస్తాలో, వై ఆర్ ఆర్ కాంప్లెక్స్, గిరిజన సోషల్ వెల్ఫేర్ పాఠశాల నందు వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కిష్టారెడ్డి అభిమానులు మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులు ఎడమ సత్యం, ఎడమ వేణులకు ఎడమ కిష్టరెడ్డి విగ్రహ ఆవిష్కరణ చేయాలని, ఆ విగ్రహ ఖర్చు మొత్తం పూర్తిగా అభిమానులదే అని తెలిపారు. వారి కుమారులు మాట్లాడుతూ, మా నాన్న చేసిన సేవలు, ప్రజల్లో ఇంత అభిమానం ఎన్ని కోట్ల రూపాయలకైనా వెలకట్టలేనిదని, మీకు మా నాన్న పేరు మీద ఉన్న అభిమానం ఎన్ని కోట్ల రూపాయలు ఇచ్చిన వెలకట్టలేనిదని, నాన్న చేసిన సేవలే మా కుటుంబ సభ్యులకు శ్రీ రామ రక్షా అని ఏడ్మా సత్యం చెప్పారు, నాన్నకి విగ్రహలు ఇష్టం ఉండదు, కానీ ఎడమకిష్టారెడ్డి అభిమానుల కోరిక మేరకు, విగ్రహ ఏర్పాట్లకు ఎప్పుడు కూడా మా కుటుంబ సభ్యులు అండగా ఉంటారని చెప్పారు.ఏడ్మా కిష్టారెడ్డి అభిమానులంతా, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముఖ్య నాయకులు వై ఆర్ ఆర్ కాంప్లెక్స్ నందు కిష్టన్న చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు.

## గంగా తెప్పోత్సవం లో బీసీ కమిషన్ చైర్మన్



**విశ్వంభర, హైద్రాబాద్ :** గంగా తెప్పోత్సవం అందరి మేలు కోరేది అని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు నగరంలోని ఖైరతాబాద్ లో మత్స్యకార, గంగపుత్ర వర్గ ప్రజలు నిర్వహించే గంగా తెప్పోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. సకల ప్రజల మేలును కోరే గొప్ప ఉత్సవ కార్యక్రమం అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. నగరంలో ఆషాడమాసంలో బోనాలు సాంప్రదాయంగా నిర్వహించబడతాయి కాగా మత్స్యకార గంగా తెప్పోత్సవం శ్రావణమాసం లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం నాడు తుమ్మల బస్తీనుండి ఆరంభమైన అమ్మవారి గంగా తెప్పోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడు గుడి ల వద్ద నుండి ట్యాంక్ బండ్ సమీపంలోని అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపుగా మహిళలు బోనాలు ఎత్తుకొని వెళ్లి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ తెప్పోత్సవ కార్యక్రమంలో మత్స్యకార కుటుంబాలకు చెందిన వందలాది మహిళలు బోనాలు ఎత్తి గంగా తెప్పోత్సవ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు తుమ్మోరి శ్రీరాములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మల్కుమహేందర్ బాబు,చందు, మంగినపల్లి కుమార్, మంగినపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్ బోల్తా

**విశ్వంభర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా :** మహాదేవపూర్ మండలం సూరారం క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాలు తరలించే కంటైనర్ వాహనం బోల్తా పడింది. హైదరాబాద్ నుండి చత్తీస్ ఘడ్ లోని బీజాపూర్ కు ద్విచక్ర వాహనాలను తీసుకువెళుతున్న కంటైనర్ అదుపు తప్పడంతో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవరు క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## గాంధీజీ ఫౌండేషన్ సహకారంతో నిత్యవసర సరుకులు పంపిణీ

- చేనేత పరిరక్షణ సేవాసమితి సేవలు ప్రశంసనీయం
- గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు...



**విశ్వంభర, చండూరు :** చేనేత పరిరక్షణ సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. చండూరులోని పద్మావతి కాలనీలో చేనేత పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో గాంధీజీ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన చేనేత కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో తాను గాంధీజీ ఫౌండేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. పని లేక ఇబ్బంది పడుతున్న చేనేత కార్మిక కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి చేనేత పరిరక్షణ సేవా సమితి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. పేదలను ఆదుకోవడంలో గాంధీజీ ఫౌండేషన్ ఎప్పటికీ తన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దోటి సుజాత వెంకటేష్ మాట్లాడుతూ చేనేతల సమస్యలను ఇప్పటికే తాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఎమ్మెల్యే, సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించేందుకు అన్ని విధాల ఆయన సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్ గుంటి వెంకటేశం మాట్లాడుతూ చేనేత పరిరక్షణ సేవాసమితి చేస్తున్న సేవలను కొనియాడారు. సమితికి అన్ని విధాలా తన సహాయ సహకారాలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత చిలుకూరి ధనుంజయను ఘనంగా సన్మానించారు. అలాగే గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ కోడి శ్రీనివాసులును చేనేత పరిరక్షణ సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నిరుపేద చేనేత కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీను, కార్మిక సంఘం అధ్యక్షుడు తిరందాసు శ్రీను, భూతరాజు వేణు, చేనేత పరిరక్షణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, చెరుపల్లి కృష్ణ, చిలుకూరి చంద్రశేఖర్,ఏలే శ్రీనివాసులు, సంగెపు శ్రీనివాసులు, వర్కాల విజయ్, చెరుపల్లి వెంకన్న,చెరుపల్లి నరేష్, పులిపాటి గోపయ్య, తిరందాసు గోపయ్య, సంగెపు మల్లేష్, చెరుపల్లి రాఘవేంద్ర, కర్నాటి నగేష్,జూలూరు సురేష్, గానుగు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



**విశ్వంభర,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :** భద్రాచలంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, భద్రాచలం మండలంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఆర్ఎస్ బాలాజీ రాజు, కుంజ వెంకటరమణమూర్తి లకు కలిసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.సంఘానికి వారు చేసిన కృషిని అభినందించారు. వారి భావి జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ విరమణ సమయాన్ని సంఘ సేవకు సామాజిక స్పృహతో సమయాన్ని కేటాయించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ కృష్ణ, బి కిషోర్ సింగ్, జిల్లా ఉపాధ్యక్షులు బి మురళీమోహన్, జిల్లా ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు డి.తావూరియా ,ఎస్ శైలజ, ఎస్ విజయ్ కుమార్, ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ టీవీఎస్ ప్రసాద్, ఐటీడీఎస్ సబ్ కమిటీ కన్వీనర్ తేజావత్ బాలు, బూర్గంపాడు అధ్యక్షులు ఎం సత్యనారాయణ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజా శ్రీనివాస్, భద్రాచల మండల ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నకు నివాళి



**విశ్వంభర,నాగర్ కర్నూలు;** తిమ్మాజీపేట మండల కేంద్రంలోసర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఘన నివాలులు అర్పించారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్ర తీకగా నిలిచారనీ అన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో ఎప్పటికీ నిలిచి ఉంటుందనీ, సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా వారి కృషిని, పట్టుదలను, వారు పోషించిన చారిత్రక పాత్రను ప్రతిఒక్కరు స్మరించుకోవాల్సిన తరుణమిది అని తెలిపారు.కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాడడం ఎంతో గొప్ప విషయం అని,విశ్వకీర్తిని పొందిన పాపన్న గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ప్రతి ఏటా వారి జయంతి, తెలంగాణ స్వయం పాలనలో సబ్బండ వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడంతోపాటు, స్వరాష్ట్రంలో వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం ద్వారా పాపన్నగౌడ్ ఆశయాల సాధన కు శక్తి వంచన లేకుండా కృషి చేయాలనీ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి సందర్భంగా పాపన్న గౌడ్ ప్రాంగణంలో పాపన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగరాజు గౌడ్, సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ చంద్రమౌళి గౌడు , జనరల్ సెక్రటరీ తిరుపతయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులు భీమయ్యగౌడ్ లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**విశ్వంభర, వికారాబాద్:** ఆలంపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలంపల్లి గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ. ఆలంపల్లి గౌడ సంఘం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలును జరపటం చాలా సంతోషంగా ఉందని, ఆయన చేసిన కృషి మరువలేనిది అని అన్నారు.ఆయన అడుగుజాడల్లోనే గౌడ సంఘం నడుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కులస్తులు, యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పాపన్న గౌడ్ ఆశయాలే ఆదర్శం



**విశ్వంభర,వికారాబాద్ :** మర్పలి మండల్ కోశంట్ పల్లి గ్రామంలో తెలంగాణ విముక్తి కోసం రజాకార్లతో తిరుగులేని పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ పాపన్న గౌడ్ అని, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని వికారాబాద్ జిల్లా ఉద్యోగ సంఘాల, జిల్లా గౌడ సంఘ నాయకులు తుల్జారం పేర్కొన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను కోశంట్ పల్లి లో ఘనంగా నిర్వహించారు. రజాకార్లతో ప్రాణాలకు తెగించి సర్దార్ పాపన్న గౌడ్ పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల గౌడ సంఘం అధ్యక్షుడు నాయబ్ గౌడ్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ గౌడ్, గ్రామ నాయకులు . క్రిష్ణ గౌడ్, నర్సింహులు గౌడ్, రమేశ్ గౌడ్, శ్రీ శైలం గౌడ్ వీరేషం గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సుచిత్రలో లలిత జ్యువెల్లర్స్' 56 వ బ్రాంచ్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ;** సుచిత్రలో 'లలిత జ్యువెల్లర్స్' 56వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుచిత్ర సర్కిల్ లో లలిత జ్యువెల్లర్స్ నూతన శాఖను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బంగారాన్ని, వెండి ని అందించాలని అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లలిత జ్యువెల్లర్స్ ఎండి కిరణ్ ను కోరారు. ఈ కార్యక్రమంలో లలిత జ్యువెల్లర్స్ ఎండి కిరణ్ సినీ నిర్మాత బండ్ల గణేష్ కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిరెడ్డి, బాలప్ప, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్ , లలిత జ్యువెల్లర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



**విశ్వంభర, వెల్దండ :** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఎక్వాయిపల్లిలలో సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల నివాళులు అర్పించారు. కంటోనిపల్లి, కుప్పగండ్ల గ్రామలలో ఆయన విగ్రహ ఆవిష్కరణ చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల ముఖ్య నాయకులు మాజీ సర్పంచులు మట్ట పరమేష్ గౌడ్ రామకృష్ణ గౌడ్ గౌడ సంఘం నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ తాలూకా గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ కటౌట్లు.. చిరువ్యాపారులకు ఇక్కట్లు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రం లో ఈ నెల 1 వ తారీఖున జరిగిన మంత్రుల పర్యటనలో భాగం గా కొందరు అధికార పార్టీ నాయకులు కటౌట్ ను ఏర్పాటు చేశారు. అది కాస్త చిరువ్యాపారులకు ఇబ్బందిగా మారింది. వాళ్ళు ఎన్నిసార్లు అధికారులుకు, ప్రజాప్రతినిధులని కలిసి తమ గోడుని చెప్పుకున్న అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదనీ వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ కటౌట్లను తొలిగించి తన జీవన ఉపాధికి అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు

# రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లను సిద్ధం చేయనున్నాం
- క్రీడా స్టేడియాలను ఒలింపిక్స్ గ్రేడ్‌కు సమానంగా తీర్చిదిద్దుతున్నాం
- ఆనంద్ మహీంద్రాకు ట్వీట్‌కు రీట్వీట్ వివరించిన సీఎం రేవంత్




**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్ ఒలింపిక్ ఛాంపియన్లను సిద్ధం చేసేందుకు 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ) లోని స్పోర్ట్స్ హబ్‌లో దీన్ని ఏర్పాటుచేయనున్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్థాపించనున్న ఈ విశ్వవిద్యాలయంలో డజనుకుపైగా స్పోర్ట్స్ అకాడమీలు రానున్నాయి. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతోపాటు స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ సెంటర్లు కూడా అందుబాటులో ఉంటాయి.

**కొరియన్ క్రీడా వర్సిటీ సాంకేతిక భాగస్వామిగా ..**

క్రీడా యూనివర్సిటీకి అనువైన స్థలం కోసం హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం దక్షిణకొరియా పర్యటనకు వెళ్లినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. 1976లో ప్రారంభించిన ఈ వర్సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత స్పోర్ట్స్ వర్సిటీగా నిలిచింది.ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో దక్షిణకొరియా 32 పతకాలు సాధించగా వాటిలో 16 పతకాలు కొరియన్ క్రీడావర్సిటీ క్రీడాకారులే సాధించారు. తన పర్యటన సందర్భంగా రేవంత్‌రెడ్డి ఆర్చరీలో మూడు బంగారు పతకాలు సాధించిన యూనివర్సిటీ అథ్లెట్ లిమ్ సిహైయోన్‌ను అభినందించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీకి కొరియన్ క్రీడా వర్సిటీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించనున్నట్లు సమాచారం. లాస్‌ఏంజెలిస్‌లో 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో మన దేశ పనితీరు మెరుగుపరిచేందుకు, తెలంగాణలో స్థాపించనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఉండాల్సిన మౌలిక వసతులపై సూచనలు, సహాయ సహకారాలు అందించాలని మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రను సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ''దేశానికి ఒలింపిక్స్ పతకాలు తెచ్చిన క్రీడాకారులను అభినందిస్తున్నా. కానీ, దేశాల వారీగా ర్యాంకులను చూసినప్పుడు కొంత బాధ కలుగుతోందని రేవంత్ ట్వీట్ చేసారు. క్రీడలపై ప్రభుత్వం డబ్బు ఖర్చు చేసింది. ప్రోత్సాహకాలు ఇస్తోంది. సదుపాయాలు పెరిగాయి. ప్రైవేటు సంస్థలూ సాయమందించేందుకు ముందుకొచ్చాయి. జాతీయ ఆలోచనా విధానం మారినప్పుడు ఒలింపిక్స్‌లో ప్రపంచాన్ని ఓడించే ప్రతిభను ఈ భూమి మీద ఏది అడ్డుకుంటోంది?" అంటూ ఆవేదన వ్యక్తంచేస్తూ ఆనంద్ మహీంద్రా శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు.ఆనంద్ మహీంద్రా ట్వీట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆయన పోస్టుకు రీపోస్టు కూడా చేశారు. ' 'మీ ఆవేదనలో దేశంపై ప్రేమ, యువతపై అపారమైన నమ్మకం కనిపిస్తోంది. నేను వ్యక్తిగతంగా ఈ విషయాన్ని మీతో పంచుకోవాలనుకున్నా. కానీ, ఇదే విషయాన్ని దేశ యువత కూడా తెలుసుకోవాలనుకుంటోంది. తెలంగాణలో యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాలపై పనిచేస్తున్నా. ఇటీవల దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సందర్భంలో కొరియా నేషనల్ స్పోర్ట్స్ వర్సిటీ అధ్యక్షుడు మూన్ వోన్‌జే బృందాన్ని కలిశానని తెలిపారు. హైదరాబాద్‌లో క్రీడా వర్సిటీ ఏర్పాటుకు భాగస్వామిగా ఉండేందుకు కొరియా యూనివర్సిటీ అంగీకరించింది. ఈ పర్యటన ఆగస్టు 13న జరిగితే గడిచిన 72 గంటల్లోనే హకీంపేట, గచ్చిబౌలిలోని 200 ఎకరాల క్యాంపస్‌లతోపాటు అన్ని క్రీడా స్టేడియాల్లో మౌలిక సదుపాయాలను ఒలింపిక్స్ గ్రేడ్‌కు సమానంగా తీర్చిదిద్దుతున్నాం.' అని రేవంత్ రెడ్డి ట్వీట్‌లో వివరించారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలపై జరిగిన దాడులపై కేటీఆర్ ఫిర్యాదు చేస్తే బావుంటుంది

### మంత్రి సీతక్క

**విశ్వంభర, హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వం లో 2014 నుంచి 23 వరకు రాష్ట్రంలో మహిళల పై జరిగిన దాడుల పై కూడా మహిళా కమిషన్ కు కేటీఆర్ ఫిర్యాదు చేస్తే బావుటుందని మంత్రి సీతక్క అన్నరు. సీఎల్పీ సమావేశం జరుగుతున్న నానక్ రాం గూడ షేర్టాన్ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడారు. 2014 23 మధ్య మహిళల పై రాష్ట్రంలో లో జరిగిన క్రైం డాటా మొత్తం నా దగ్గర ఉంది.కావాలంటే కేటీఆర్ కు ఆ డాటా ఇస్తానన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ncrb డేటాను మీడియా కి రిలీజ్ చేస్తున్నానన్నారు.2014లో 14,417 కేసులు, 2015 లొ 15425, 2016లో 15,374, 2017 లో 17,521, 2018 లో 16,027, 2019 లో 18,394, 2020 లో 17,791, 2021 లో 20,8652022 లో 22,066 కేసు లు నమోదు అయ్యాయన్నారు. . ఆ నివేదికల్లోనే ప్రతి ఏటా తెలంగాణలో మహిళల మీద నేరాలు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు.మహిళా కమీషన్ ను మేము కూడా కలుస్తామన్నారు. .బీఆర్ఎస్ పాలనలో మహిళలపై ఎన్ని నేరాలు జరిగాయో మేమునివేదిస్తామన్నారు. .యధాలాపంగా మాట్లాడా అంటూనే వాల్ల పార్టీ ఎమ్మెల్యే లతో కేటీఆర్ తిట్టిస్తున్నాడన్నారు. రుణమాఫీ చేయలేని బిఆర్ఎస్..మేము పూర్తి గా రుణమాఫీ చేయకముందే విమర్శలు ఎందుకు అన్నారు.

## తెలంగాణలో కొత్త ట్రైన్ రూట్!

**దక్షిణ అయోధ్య భద్రాద్రికి ఒక్క లెవల్ క్రాసింగ్ కూడా లేకుండా నిర్మించేలా డిజైన్**



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. త్వరలోనే తెలంగాణలోని . భద్రాద్రి ప్రాంతం గుండా కొత్త ట్రైన్ మార్గం అందుబాటులోకి రాబోతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది.నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ కొత్త ట్రైన్ మార్గం అనేది దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాద్రి మార్గం గుండా వేయనున్నారు. ముఖ్యంగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు ఈ ట్రైన్ మార్గాన్ని నిర్మించనున్నారు. అయితే వచ్చే ఐదేళ్లలో 202930 కల్లా ఈ రైలు మార్గం ప్రాజెక్ట్ ను పూర్తిచేయాలని రైల్వేశాఖ టార్గెట్ పెట్టుకుంది. ఈ ట్రైన్ మార్గంలో ఒక్క లెవల్ క్రాసింగ్ కూడా లేకుండా నిర్మించేలా డిజైన్ రూపొందించారు. కాగా, ట్రైన్ మార్గం మొత్తం పొడవు వు 200.60 కి.మీ. అయితే ఈ మార్గంలో ఏకంగా 301 వంతెనలను నిర్మించనున్నారు. అంటే ప్రతి రెండు కిలోమీటర్లకు మూడు బ్రిడ్జిలు చొప్పున నిర్మించనున్నారు.ఈ ట్రైన్ మార్గంలో మూడు భారీ వంతెనలు, 34 పెద్ద వంతెనలు, 264 చిన్న వంతెనలు, 41 ఆర్వోబీలు, 76 ఆర్ యూబీలు నిర్మించనున్నారు. ఇకపోతే మల్కన్ గిరి వయా భద్రాచలం నుంచి పాండురంగాపురం మార్గంలో నిర్మించే ఈ కొత్త రైల్వే మార్గంలో 14 రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. కానీ, అవి ఏ ప్రాంతంలో ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు అనే విషయాలను తెలియజేయలేదు. కాకపోతే త్వరలోనే ఈ విషయంపై క్లారిటీ రానుంది. అయితే భద్రాచలం వద్ద గోదావరి నదిపై భారీ వంతెన నిర్మించేందుకు డీపీఆర్ ఇప్పటికే అంత సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే తొలుత మల్కన్ గిరి నుంచి భద్రాచలం వరకు మాత్రమే ట్రైన్ మార్గం నిర్మించాలని రైల్వేశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇకపోతే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉన్న ఖనిజ సంపద రవాణాకు వీలుగా.. భద్రాచలానికిక 20 కి. మీ దూరంలోని పాండురంగాపురం వరకు పొడిగించారు.అయితే డోర్నకల్‌మణుగూరు మధ్యలో ఈ పాండరంగాపురం ఉంటుంది. ఈ ట్రైన్ లైన్ ఖాజీపేటవిజయవాడ ప్రధాన ట్రైన్ మార్గానికి బ్రాంచి లైన్‌గా ఉంది. ఈ క్రమంలోనే.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని ఖనిజ సంపద, బొగ్గును భద్రాచలం, పాండురంగాపురం నుంచి వరంగల్ జిల్లా ఖాజీపేట మీదుగా ఇతర రాష్ట్రాలకు తరలించనున్నారు. దీంతో పాటు విజయవాడ మీదుగా దక్షిణాది రాష్ట్రాలకు కూడా ఖనిజ సంపద రవాణా చేసేందుకు ఈ ట్రైన్ మార్గం ఉపయోగపడనుంది. ఇక కొత్త ట్రైన్ మార్గం రాకతో కృష్ణపట్నం, మచిలీపట్నం పోర్టులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు, అలాగే తమిళనాడు రవాణాకు ఈ రైలు మార్గం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## మాజీ ఎమ్మెల్యే కరెంటు కిష్టన్న వర్ధంతి

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల కేంద్రంలో పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు కీ!శే!! యడ్మ కిష్టారెడ్డి 4 వ వర్ధంతి సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్య నాయక్, సీనియర్ నాయకులు ఉప్పల రాములు, గుత్తి బాలస్వామి,పాపి శెట్టి రాము, మాజీ ఎంపిటిసి చందు నాయక్, మాజీ వార్డు నెంబర్ వస్పుల సాయిలు, దేరంగుల వెంకటేష్, పూసల భాస్కర్, వడ్డేమోని శివకుమార్, లండం యాదయ్య, మద్దూరి ఆనంద్, దేవేందర్, రంజిత్, మహేష్, అల్లజీ, గిరి తదితరులు పాల్గొన్నారు.






## ఎవరు రాజీనామా చెయ్యాలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలి

- రుణమాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా కాకుండా సమగ్రంగా పూర్తి చేయాలి
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులే రుణమాఫీ కాలేదు అంటున్నారు. ఇప్పుడు ఎవరు రాజీనామా చేయాలో, ఎవరు ఏటిలో దూకి చావాలో, ఎవరికి చీము నెత్తురు లేదో, ఎవరు అమర వీరుల స్థూపం దగ్గర ముక్కు భూమికి రాయాలో, ఎవరు రాజీనామా చెయ్యాలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలె అంటూ ఎక్స్ వేదికగా మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావ్ పోస్ట్ చేసారు. రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని కోదండ రెడ్డి , కోదండరాం రెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురు ఒప్పుకుంటున్న వీడియోను ఆయన ట్యాగ్ షేర్ చేసారు. నేనూ అదే చెప్పాను. రాష్ట్రంలో పాక్షికంగా మాత్రమే రుణమాఫీ జరిగిందని హరీష్ రావు పేర్కొన్నారు.రూ 31 వేలు కోట్లు అని చెప్పి 17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని నేనంటే ఎందుకు రంకెలేస్తున్నారని ప్రశ్నించారు. రుణమాఫీ అయిపోయి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎందుకు రోడ్లెక్కి నిరసనలు తెలియచేస్తున్నారు..?. ఎందుకు మీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తున్నరని ప్రశ్నించారు.ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం, తొండి చేసైనా మేమే గెలిచినం అనే వైఖరి ప్రదర్శించడం అవివేకం అవుతుందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, రుణమాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా కాకుండా సమగ్రంగా పూర్తి చేయాలని, రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

## ఘనంగా గంగ తెప్పోత్సవం

- ఖైరతాబాద్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు కొనసాగిన ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతరాజు విన్యాసాలు
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంబర హైదరాబాద్:** ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఆదివారం హైదరాబాద్ మహానగరంలో గంగ తెప్పోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. మత్స్యకారులు, భోలక్పూర్ గంగపుత్ర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై కద్దావాద్ అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ఏడుగుడ్ల దేవాలయాలనుంచి ప్రారంభమైన వంగ తెప్పోత్సవ ఊరేగింపు కార్యక్రమం హుస్సేన్ సాగర్ వరకు అంత భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఊరేగింపులో భాగంగా బోనాలు, పోతరాజు నాట్య విన్యాసాలు, సంస్కృతి సాంప్రదాయానికి అద్దం పట్టేలా ప్రదర్శించిన విచిత్ర వేషధారణ లు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 2008వ సంవత్సరం నుంచి ఈ గంగ తెప్పోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యేక నిర్వహిస్తున్నామని, మత్స్యకారులకు గంగపుత్రులకు ఇది ఒక పండుగ లాంటిదని భోలక్పూర్ గంగ పుత్ర సంఘం కు చెందిన నేతలు వివరించారు. గంగ తెప్పోత్సవం కార్యక్రమం సందర్భంగా నగరంలోని పలు పురవీధులు మరోసారి బోనాల పండుగ శోభను సంతరించుకున్నాయి.



## బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలి

- ప్రజలకు వైద్య సేవలు అందించడంలో
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలది కీలక పాత్ర
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహా

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** ప్రజలకు ప్రైవేటు రంగం మరింత బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజావైద్యంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ కీలకపాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లో యూడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్ రెండో శాఖను ఆదివారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. ఇటీవల కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరికీ జుట్టు రాలడం, ఇతర చర్మ సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయని రాజనర్సింహ పేర్కొన్నారు. వాటన్నింటికీ సమగ్రంగా వైద్య సేవలు అందించడానికి వీలుగా ఒకేచోట అన్నిరకాల వైద్యం చేసేందుకు, యూడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషకరమని ఆయన అన్నారు. డాక్టర్ సృశాంత్ లాంటి యువకులు ఈ రంగంలో అత్యాధునిక పద్ధతులు పాటిస్తూ ప్రజలకు తమవంతు సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ సృశాంత్ ముక్కా మాట్లాడారు. తాము ఇప్పటికే కోకాపేటలో ఒక ఆస్పత్రి నిర్వహిస్తున్నామని, ఇప్పుడు నగరవాసులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా జూబ్లీహిల్స్‌లో సువిశాల ప్రాంగణంలో ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ అన్నిరకాల చర్మ, శరీర, జుట్టు సమస్యలకు సంబంధించిన వైద్యులు, మహిళా వైద్యులు, కాస్మోటాలజిస్టులు, డెర్మటాలజిస్టులు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు.

సాధారణ చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్ల నుంచి సోరియాసిస్ లాంటి తీవ్ర సమస్యల వరకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే జుట్టు రాలడం, పూర్తిగా ఊడిపోవడం లాంటి తీవ్రమైన ఇబ్బందుల వరకు అన్నింటికీ చికిత్సలు ఇస్తున్నట్లు తెలిపారు. కాస్మోటిక్ చికిత్సలు కూడా ఇక్కడ అందించగలమని, శరీరంలోని గుప్త భాగాలకు సంబంధించిన సమస్యలు, ఇన్ఫెక్షన్లు ఉన్నా, వాటికి సైతం సమర్థవంతంగా చికిత్సలు చేయగల సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో 5060 ఏళ్లు దాటిన తర్వాతే జుట్టు రాలడం, ఊడిపోవడం, బట్టతల ఏర్పడటం లాంటి సమస్యలు ఉండేవని, కానీ ఇప్పుడవి 1820 ఏళ్ల వయసులో కూడా వస్తున్నాయన్నారు. దీనివల్ల చాలా మంది యువతీ యువకులు ఇబ్బంది పడుతూ కాలేజీలకు వెళ్లడం కూడా మానుకుంటున్నారని, ఇలాంటి వారికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటి చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు.

# రూ.4 లక్షల్లోనే డబుల్ బెడ్రూం ఇల్లు

- సొంతిల్లు కట్టుకునేవారికి శుభవార్త ..
- ఎన్ఐఆర్డీ ఆధ్వర్యంలో శిక్షణ
- ఒక్కో చదరపు అడుగు నిర్మాణానికి రూ.987



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :**పేద, ధనిక అనే బేధాలు లేకుండా ప్రతి మనిషికి ఉండే అతి సామాన్యమైన కోరిక సొంతింటి నిర్మాణం. చనిపోయేలోపు తనది అని చెప్పుకునే ఓ గూడు నిర్మించుకోవాలని ప్రతి మనిషి ఆశపడతాడు. అయితే నేటి కాలంలో ఇంటి నిర్మాణం అనేది ఎంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గ్రామాల్లోనే ఎంతో సింపుల్‌గా ఇల్లు కట్టుకోవాలన్నా.. తక్కువలో తక్కువ సుమారు 10 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే నగరాల్లో అయితే అరకోటి పెట్టంది ఇల్లు రాదు. నేటి కాలంలో ల్యాండ్ రేటు చుక్కలను తాకుతుండగా.. ఇంటి నిర్మాణం కోసం వాడే ప్రతి సామాగ్రి రేటు.. భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే ఇంటి నిర్మాణం అనేది పేద, మధ్యతరగతి వారికి పెను భారంగా మారింది. అందుకే చాలా మంది పేదలు సొంతింటి కలను చంపేసుకుంటున్నారు. మరి మీరు కూడా ఇలానే సొంతింటి కోసం కల కని.. పెరుగుతున్న ఖర్చులను చూసి భయపడుతున్నారా.. అయితే మీకోసమే అదిరిపోయే శుభవార్త తీసుకొచ్చాం. కేవలం 4 లక్షల రూపాయలకే డబుల్ బెడ్రూం ఇంటిని నిర్మించుకోవచ్చు. వినడానికి నమ్మశక్యంగా లేకపోయినా ఇది మాత్రం వాస్తవం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వంభర పాఠకులకు కోసం ...

నాలుగు లక్షల రూపాయలకే డబుల్‌బెడ్రూం ఇంటిని నిర్మించి చూపించారు హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీ) నిపుణులు. పేద, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకుని.. కేవలం 4.4 లక్షల ఖర్చుతో డబుల్ బెడ్రూం ఇంటిని నిర్మించి.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరతో ఈ డబుల్‌బెడ్రూం ఇంటిని నిర్మించినట్లు ఎన్ఐఆర్డీ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న వాళ్లు ఈ తరహా ఇంటిని నిర్మించుకోవచ్చని చెబుతున్నారు. ఈ నిర్మాణంపై త్వరలోనే మేస్త్రీలు, ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్ఐఆర్డీలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

**ఎలా నిర్మించారంటే..**

కేవలం నాలుగు లక్షల రూపాయల ఖర్చుతోనే నిర్మించిన ఈ డబుల్‌బెడ్రూం ఇంటి నిర్మాణం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ ఇంటి నిర్మాణం పునాది కోసం బండరాళ్లనే వాడారు. వాటిపై ఇటుకలతో స్తంభాలు నిర్మించారు. ఆ తర్వాత వాటి మధ్య వెదురు బొంగులు అమర్చి.. వాటి చుట్టూ సిమెంటు పూత పూసి గోడలు నిర్మించారు. వీటిపైన ఇనుప కమ్మలు, కంకర, సిమెంట్ మిశ్రమంతో బీమ్‌లను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కుమ్మరి గూనలతో గుమ్మటం ఆకారంలో పైకప్పు వేశారు. వర్షం నీటికి కురకకుండా చూడటం కోసం పైకప్పును సిమెంటుతో ప్లాస్టరింగ్ చేసి.. ఆపై టైల్స్ అతికించారు.ఫ్లోరింగ్ కోసం తాండూరు రాళ్లను వాడారు. ఆవుపేడ ఆధారిత సహజ రంగులతో పెయింట్ వేశారు. పెంకులతో పైకప్పు నిర్మించడం, వెదురుబొంగుతో గోడ నిర్మాణం చేయడం వల్ల.. ఈ ఇల్లు పర్యావరణహితంగా ఉంటుందని నిపుణలు చెబుతున్నారు . ఇలా నిర్మించిన ఇల్లు.. వేసవి కాలంలో చల్లగా.. శీతాకాలంలో వెచ్చగా ఉంటుందని తెలిపారు. కేవలం 4 లక్షల్లో నిర్మాణమయ్యే ఈ నమూనా ఇంటిలో అన్ని సౌకర్యాలున్నాయి అంటున్నారు. 409.05 చదరపు అడుగుల్లో నిర్మించే ఈ ఇంట్లో.. 77.50 చదరపు అడుగుల్లో(చ.అ.) హాలు, 49 చ.అ.లో వంటగది, 80.83 చ.అ.లో పడక గది.., 23.56 చ.అ.లో అటాచ్డ్ బాత్రూం, 78.14 చ.అ.లో ఇంకో పడక గది, దానికి అనుబంధంగా 16.88 చ.అ.లో అటాచ్డ్ బాత్రూం ఉంటుంది. అంతేకాకుండా.. 30.02 చ.అ.లో బట్టలు ఉతుక్కునే (వాష్ ఏరియా ) కూడా వీలుంటుంది ఉంది. ఇంటి నిర్మాణం చూసుకుంటే.. మొత్తంగా.. ఒక్కో చదరపు అడుగు నిర్మాణానికి కేవలం 987 రూపాయలు ఖర్చయినట్టు నిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వాలు కూడా ఈ విధానాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ఈ ఇంటి నిర్మాణం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది.


విశ్వంభర
V3 NEWS



# ఆలూపొట్టుతో.. పొట్ట శుభ్రం!


**ఆలుగడ్డలంటే ఇష్టపడని వాళ్లు అరుదు. అయితే, మనం చాలావరకు ఆలుగడ్డల పొట్టు తీసేసి వండుకుంటాం. కానీ, ఆలూలోని పోషకాల్లో ఎక్కువ శాతం పొట్టులోనే ఉంటాయంటున్నారు పోషక నిపుణులు. ఆలుగడ్డల పొట్టులో పీచు పదార్థం అపారంగా ఉంటుంది. విటమిన్లు, ఖనిజ లవణాలు, ఫైటో కెమికల్స్.. అన్నీ కూడా గడ్డలో కన్నా పొట్టులోనే ఎక్కువ. విటమిన్-సి కూడా అధికమే. దీంతోపాటు విటమిన్-బి కాంప్లెక్స్, కాల్షియం ఉండటం వల్ల వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది.**

### మలబద్ధకానికి..



కూరగాయల పొట్టులో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఆలుగడ్డ పొట్టులో కూడా పీచు పుష్కలం. ఈ పీచును ఆహారంలో చేరిస్తే మలబద్ధకాన్ని నివారించవచ్చు. జీర్ణ క్రియ మెరుగుపడుతుంది.

### క్యాన్సర్‌కు కవచం




ఆలుగడ్డ పొట్టులో మొక్కల్లోని రసాయనాలు (ఫైటో కెమికల్స్) శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్లుగా ఉపయోగపడుతాయి. దీనిలో క్లోరోజెనిక్ ఆమ్లం ఎక్కువ. క్యాన్సర్ నుంచి రక్షణనిస్తుంది.

### తగ్గే కొలెస్ట్రాల్



పీచు పదార్థం, యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్, ట్కగ్లైకోఆల్కలాయిండ్స్.. అన్నీ కలిసి ఉండటం వల్ల ఆలుగడ్డ పొట్టు కొలెస్ట్రాల్ ప్రభావాలను తగ్గిస్తుంది.

### నల్ల మచ్చలకు..



ఆలుగడ్డ పొట్టులో యాంటీ బ్యాక్టీరియల్, ఫీనోలిక్, యాంటి ఆక్సిడెంట్ పదార్థాలు ఉంటాయి. దాంతో ఇది బ్లీచింగ్‌గా పనిచేస్తుంది. అప్పుడే తీసిన పొట్టును ముఖానికి రుద్దుకుంటే, మంచి ఫలితం ఉంటుంది. దీంతో కళ్ల కింద నల్లటి వలయాలు, నల్లమచ్చలు పోతాయి. తరచూ ఇలా చేస్తే, మెరిసే చర్మం మీ సొంతం.

### చర్మ ఆరోగ్యానికి



కాలిన గాయాలకు ఆలుగడ్డ పొట్టు యాంటీ బ్యాక్టీరియల్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసి, దాని పనితీరు బాగుండేలా చేస్తుంది. చిన్న గాయాలకు ఆలుగడ్డ పొట్టుతో డ్రెస్సింగ్ కూడా చేసుకోవచ్చు.

### షుగర్‌కి చెక్





ఆకలి ఎక్కువగా ఉందా.. అయితే ఆలుగడ్డ పొట్టు అనవసరమైన ఆకలిని తగ్గిస్తుంది. పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర మోతాదు పెరుగకుండా కూడా సహాయపడుతుంది. ఆలుగడ్డ పొట్టును తీసుకుంటే టైప్-2 డయాబెటిస్‌ను నివారించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. గుండెజబ్బు రిస్కూ తగ్గుతుంది.

### హెయిర్ కలరింగ్ కోసం..



జుట్టు తెల్లబడుతుంటే ఆలుగడ్డ పొట్టు ద్వారా అద్భుతాలు చేయవచ్చు. జుట్టుకు సహజమైన రంగు, రూపు ఇవ్వడానికి తోడ్పడే పోషకాలన్నీ ఆలు పొట్టులో ఉంటాయి.

### గుండెకు రక్షణ



ఆలుగడ్డల పొట్టు అధిక మోతాదులో పొటాషియంను కలిగి ఉంటుంది. గుండెపోటు, స్ట్రోక్ రిస్క్ తగ్గించడంలో పొటాషియం కీలకమైంది. ఇది రక్తపోటును తగ్గించడం ద్వారా గుండె, రక్తనాళాల ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. ఆలుగడ్డ పొట్టులో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి కూడా గుండెకు రక్షణ నిచ్చేవే.






# నులివెచ్చని కశ్మీరం



ఒకప్పుడు కశ్మీర్ పశుమినా షాల్ ...డం అంటే స్టేటస్ సింబల్. ...లు తమ రచనల్లో సంపన్న ...లోని మహిళ వర్ణనలో కశ్మీరీ షాల్ ఉండేది. ఆ పశుమినా ...గవుతున్న టైమ్‌లో ఓ ఫ్యాషన్ డిజైనర్... కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. పశుమినా మెటీరియల్‌తో ఓవర్ కోట్‌తోపాటు మరికొన్ని సొబగులద్ది ఈ ఏడాది ముంబయిలో జరిగిన'లాక్మే ఫ్యాషన్ వీక్'లో ప్రదర్శించింది. ఇరవై ఆరేళ్ల స్టాంజిన్ పాల్‌మో చేసిన ప్రయోగం కశ్మీర్‌లోని స్థానిక తెగల గిరిజనులకు కొత్త ఉపాధికి మార్గమైంది.స్టాంజిన్ పాల్‌మో ఢిల్లీ, నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రాడ్యుయేషన్ కోర్సు చేసింది. సోనాల్ వర్మ వంటి సీనియర్ డిజైనర్‌తోపాటు అనేక మంది డిజైనింగ్ ఎక్స్‌పర్ట్‌ల దగ్గర పని చేసింది. వారితోపాటు విదేశాల్లో జరిగిన ఫ్యాషన్‌షోలలో కూడా పాల్గొన్నది. ఈ క్రమంలో రెండేళ్ల కిందట లధాక్ చేనేత మగ్గాల గురించి తెలిసిన తర్వాత సొంతంగా ప్రయోగాలు మొదలు పెట్టింది. డిజైనింగ్ రంగంలో

'జిల్‌జామ్' బ్రాండ్‌తో తన మార్కును విజయవంతంగా చూపిస్తోంది. "లధాక్, లే... చేనేత గురించి తెలుసుకునే కొద్దీ... నేను వెతుకుతున్న వజ్రమేదో దొరికినట్లయింది. 'బిట్‌వీన్ ద ఎర్త్ అండ్ స్కై' కాన్సెప్ట్‌తో రూపొందించిన డిజైన్‌లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి" అన్నారామె. "పశుమినా వస్త్రానికి పొట్టేలు, జడల బర్రె, ఒంటెల నుంచి సేకరించిన ఊలును ఉపయోగిస్తారు.

కశ్మీర్‌లోని లధాక్‌లో నివసించే గిరిజనులు ఈ నేతలో నిపుణులు. నిజానికి పశుమినా ఫ్యాబ్రిక్‌ను నేను ప్రమోట్ చేశానని ఎవరైనా అంటే అది శుద్ధ అబద్ధం. 'పశుమినా' అనే పదమే ఒక బ్రాండ్. ఆ చేనేతలో దాగిన పనితనాన్ని వర్ణించడానికి నాకు మాటలు కూడా రావు. అయితే ఇంత వరకు ఈ ఫ్యాబ్రిక్ గురించి తెలిసిన వాళ్లు తక్కువ. ఇప్పుడు కొత్త తరానికి సరికొత్త రూపంలో పరిచయం చేయగలిగాను. ఇందులో నా పాత్ర ఇంత వరకే. ఇందులో నేను తెచ్చిన కొత్తదనమంతా రెండు-మూడు రకాల కళలను మిళితం చేయడమే.




**కశ్మీరీ పశుమినా షాల్స్ కప్పుకోవడం ఒకప్పటి ఫ్యాషన్. ఒకనాటి భాగ్యవంతుల, మేధావుల ఫ్యాషన్ స్టేట్‌మెంట్ అది. కశ్మీర్ వస్త్రాన్నీ, ఒరిస్సా-బెంగాల్ డిజైన్లనీ, లద్దాఖ్ గిరిజనుల కళా నైపుణ్యాలనూ కలగలిపి కనుమరుగవుతున్న పశుమినాషాల్స్‌కు కొత్త సొబగులద్ది మళ్లీ వాటికి మళ్లీ ప్రాణం పోసింది ఫ్యాషన్ డిజైనర్ 'స్టాంజిన్ పాల్‌మో'! కశ్మీర్ నుంచి యాపిల్ వస్తోంది, వాల్‌నట్ వస్తోంది. పశుమినా షాల్ వస్తోంది. ఇవన్నీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరిస్తున్నాయి.**

## సాధికార మహిళలు

స్టాంజిన్... తన డిజైనింగ్ ప్రయోగం కోసం లధాక్, లేలలో అనేక గ్రామాల్లో పర్యటించారు. ఆ సంగతులను తెలియచేస్తూ ... "ఆ మహిళలతో మాట్లాడినప్పుడు ఆధునిక ప్రపంచం ఆశ్చర్యపడే విషయాలెన్నో తెలిశాయి. పని చేయడం మాత్రమే కాదు, కుటుంబానికి తమ శ్రమ ఎంత అవసరమో వాళ్లకు తెలుసు, అలాగే కుటుంబానికి తమ అవసరంతోపాటు కుటుంబంలో తమ ప్రాధాన్యత ఎంతో కూడా వాళ్లకు బాగా తెలుసు. వాళ్లకు జీవితం పట్ల ఆందోళన లేదు, వాళ్ల మాటల్లో నిరాశనిస్పృహలు లేవు. ఊలు సేకరణ, ప్రాసెసింగ్‌తోపాటు వడకడం, వస్త్రాన్ని నేయడం వరకు అనేక దశల్లో మహిళల సేవలే కీలకం. ఇప్పుడు నాతో యాభై మంది మహిళలు పని చేస్తున్నారు. తాము తయారు చేసిన షాల్‌ను... జాకెట్, కోట్ రూపంలో చూసుకుని సంతోషిస్తున్నారు. తమ పిల్లలకు వాటిని వేసుకుని మురిసిపోతున్నారు. వాళ్లను చూసినప్పుడు నా బ్రాండ్‌లను అక్కడి పిల్లలు కూడా ప్రమోట్ చేస్తున్నారనే సంతోషం కలుగుతుంటుంది" అన్నారు స్టాంజిన్ పాల్‌మో.

పశుమినా వస్త్రం మీద ఒడిషా, బెంగాల్ సంప్రదాయ ఎంబ్రాయిడరీ డిజైన్‌లను వేయించాను. ఢిల్లీలో ఒడిషా, వెస్ట్ బెంగాల్ నుంచి వచ్చి స్థిరపడిన కారీగార్ కుటుంబాలు చాలా ఉన్నాయి. వాళ్లంతా వాళ్లకు వచ్చిన సంప్రదాయ ఎంబ్రాయిడరీ పనులకు గిరాకీ లేక, ఆటో నడుపుతూ, వాచ్‌మెన్‌లుగా జీవిస్తున్నారు. వారి కుటుంబాల్లో ఆడవాళ్లందరికీ ఎంబ్రాయిడరీ వచ్చి ఉంటుంది. వాళ్లకు ఈ పశుమినా శాలువాల మీద ఎంబ్రాయిడరీ చేయించాను. ఈ రకంగా కశ్మీర్ చేనేతను, ఒడిషా ఎంబ్రాయిడరీని దేశమంతటికీ తెలిసేలా చేయగలిగాను. ఇక విదేశాల్లో వీటిని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలనేది నా లక్ష్యం. అదే జరిగితే... ఈ వస్త్రాలను నేసే మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని సంపాదించుకునే మార్గం వేయగలిగిన దాన్నవుతాను. ఈ వస్త్రాలు ఎంతటి చలినైనా అపగలుగుతాయి. ధరించిన వారికి నులివెచ్చని అనుభూతినిస్తాయి. విదేశాల్లో తయారవుతున్న ఊలుకంటే కశ్మీర్ పశుమినా వస్త్రాలు కంటికి ఇంపుగా కూడా ఉంటాయి. అందుకే మన కళను ఖండాంతరాలు దాటించడం పెద్ద కష్టమేమీ కాదనుకుంటున్నాను'' అన్నారు. స్టాంజిన్. లధాక్ మహిళలు ఏడాదిలో ఆరు నెలల పాటు వస్త్రాలను నేస్తారు. మిగిలిన ఆరు నెలలు నేతకు వాతావరణం సహకరించదు. ఇప్పటి వరకు వాళ్లకు ఉన్న ఏకైక మార్కెటింగ్ జోన్ పర్యాటకం మాత్రమే. "ఈ శాలువాలను కశ్మీర్ పర్యటకను వచ్చే పర్యాటకులకు అమ్ముకుంటున్నారు. సంప్రదాయ డిజైన్‌లకు పరిమితమైన లధాక్, లే మహిళలకు వాళ్ల చుట్టూ ఉన్న అందాలనే వస్త్రాల్లో నిక్షిప్తం చేయగలిగేలా శిక్షణ ఇచ్చాను. ఆల్రెడీ చెయ్యి తిరిగిన వాళ్లు కావడంతో నేనిచ్చిన కొత్త డిజైన్‌లను త్వరగా ఒంటబట్టించుకున్నారు. కశ్మీర్ మహిళల నేత నైపుణ్యం ఇప్పటి వరకు కశ్మీర్ పర్యటనకు వెళ్లి వచ్చిన వాళ్ల దగ్గర మాత్రమే కనిపించేది. నా ప్రయత్నంలో దేశంలో ప్రతి ఇంటికీ కశ్మీర్ శాలువాను చేర్చగలుగుతాను. అలాగే... ప్రతి ఒక్కరినీ కశ్మీర్‌కు తీసుకెళ్లలేను, కానీ కశ్మీర్‌ను ప్రపంచమంతటికీ విస్తరించగలుగుతాను" అన్నారు స్టాంజిన్ ధీమాగా.











మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తీలోని బంజారా సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దండి మేరమ్మ పండగ మహోత్సవం, శీత్ల పండుగ , తీజ్ పండుగ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు.
- విశ్వంభర, ఎల్బీనగర్

## వైద్యులపై ఇలాంటి ఘటనలు
# అత్యంత బాధాకరం

- నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి..
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సందేశం ఇవ్వాలి
- దేశవ్యాప్తంగా వైద్యులకు భద్రత కల్పించాలి
- ఐఎంఏ ప్రకటించిన వైద్య సేవల బంద్‌కు ఎంపీ కడియం కావ్య సంఘీభావం



**విశ్వంభర, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కలకత్తాలోని ఆర్ జీకర్ మెడికల్ కాలేజీలో డ్యూటీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరించి, నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువ మహిళా డాక్టర్ హత్యాచార ఘటనపై దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా తెలంగాణ ఐఎంఏ పిలుపు మేరకు హైదరాబాద్ ధర్నాచౌక్‌లో జరిగిన నిరసనలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. విధినిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్ల రక్షణకు చట్టాలు తీసుకురావలసిన ఆవశ్యకతను ఎంపీ నొక్కి చెప్పారు. ఆగస్టు 9న కలకత్తాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీ లో డ్యూటీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటన తీవ్రంగా కలిచివేసిందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు తెలిపారు. వైద్యుల పై ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత అమానుషం అన్నారు. యావత్ దేశాన్ని కదిలించిన ఈ సంఘటనపై సిబిఐ నిష్పక్షపాతంగా పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యంత దారుణంగా పాశవికంగా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వైద్యులపై జరిగే దాడుల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలనీ, దాడులకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్నీ ప్రభుత్వ, ప్రయివేట్ మెడికల్ కళాశాలలు, అస్పత్రులలో భద్రతను పెంచి, వైద్యులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్

**విశ్వంభర, బషీర్ బాగ్:** హైదరాబాద్ డీఈఓ కార్యాలయ సూపర్డెంట్ సుగుణరెడ్డి కుమారుడు శ్రీనివాస్ శ్రావ్య వర్ధిని వివాహం నాచారంలోని కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్జెడిఎస్సి శాస్త్రి, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె ఆర్ రాజ్ కుమార్‌లు నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. జయంతి రెడ్డి, సుదర్శన్, జి.రాజ్ కుమార్, జయలక్ష్మి, శ్రీకాంత్, సరళ రెడ్డి, రాణి, హేమావతి, లక్ష్మీపతి, శివ జ్యోతిరెడ్డి, చైతన్య, విజయకుమార్, సుబ్బారావు, సర్వరాజ్, శంకర్ తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

## పోలవరం దస్త్రాల దహనం కేసులో నలుగురు అధికారుల సస్పెన్షన్



**విశ్వంభర, ధవళేశ్వరం:** తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం దస్త్రాల దహనం కేసులో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. సీనియర్ అసిస్టెంట్లు కె. నూకరాజు, కారం బేబీ, స్పెషల్ ఆరా కళాజ్యోతి, సబార్డినేట్ రాజశేఖర్ను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సస్పెండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు ఎ. కుమారి, ఎ. సత్యదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం దస్త్రాలను గుట్టుగా కాల్చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణ విభాగం దస్త్రాలుగా పేర్కొంటున్న వీటిని.. కార్యాలయ గేటు బయట సిబ్బంది కాల్చేశారు. మీడియా వెలుగులోకి తేవడంతో సగం కాలిన కొన్నింటిని లోపలకు తరలించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకపోవడం, వారంతా సెలవులో ఉన్నప్పుడు జరగడం, కాల్చిన స్వీపర్ విశాఖ వెళ్లిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కాలిఫోర్నియా బీచ్‌లో ఆంధ్రవాసి మృతి..

**విశ్వంభర, అమరావతి :** అమెరికాలో కాలిఫోర్నియా బీచ్ లో ప్రమాదవశాత్తు నీటమునిగి ఏపీకి చెందిన సాఫ్ట్‌వేర్ మృతి చెందాడు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన బుచ్చిబాబు(40) శనివారం సాయంత్రం ఫ్యామిలీతో కలిస బీచ్‌కు వెళ్లారు.బీచ్‌లో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. కుమారుడి మరణం వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీటిపర్యంతం అయ్యారు. బుచ్చిబాబు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కూరెళ్ళలో సర్దార్ సర్వాయి పాపన్న, ధర్మ భిక్షం విగ్రహాల ఆవిష్కరణ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం కూరెళ్ల గ్రామంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న, ధర్మ భిక్షం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా విగ్రహాల దాత కప్పల సోమయ్య అలియాస్ పరిటాల రవి, మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య, మాజీ వైస్ ఎంపీపీ భాష బోయిన పద్మ పాపయ్య గౌడ్, సంఘం అధ్యక్షుడు సుధాగాని మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జాంగిర్ గౌడ్, కార్యదర్శి గణగాని శ్రీను గౌడ్, సీపీఐ జిల్లా నాయకుడు ఉప్పల ముత్యాలు, టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ళ రమేష్, సిపిఎం మండల కార్యదర్శి వేముల భిక్షం తదితరులు పాల్గొన్నారు.



## "మూడో చెవి" పుస్తక ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రతాప్ రాజులపల్లి రచించిన మూడో చెవి పుస్తకావిష్కరణ రవీంద్రభారతిలో జరిగింది. పుస్తకాన్ని సినీ నటుడు, కవి, రచయిత తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. ఈసందర్భంగా తనికెళ్ల భరణి ప్రసంగిస్తూ... తన అనుభవంలో అంగవైకల్యము, గురించిన కొన్ని విశేషాలు చెబుతూ "కోశిష్" హిందీ సినిమా దర్శకుని ప్రతిభను కొనియాడారు. అలాగే రాజా ది గ్రేట్, కళ్ళు లేని అబ్బాయిని ఉన్నతంగా తీర్చిదిద్దిన చిత్రకథ సారాంశం ప్రస్తావించారు. నేటి పుస్తకం సంబంధించిన హీరో నిరంజన్ పుట్టుకతో వినబడని మనిషి దీప తల్లి తల్లిదండ్రులు ఇద్దరు వారిని పెంచిన తీరు ప్రస్తుతం నిరంజన్ బీటెక్ చదివి అంతేగాక ఎక్స్ట్రా కరీకులర్ యాక్టివిటీస్ లో కూడా పార్టిసిపేట్ చేయడం చాలా ఆనందంగా ఉంది అన్నారు నిరంజన్ ని చూస్తుంటే నా హృదయం నిజంగా నిరంజన్ మాట్లాడుతుంటే నా హృదయం ద్రవించింది అన్నారు. ఇలా కొన్ని ఉదాహరణలు చెబుతూ ఒకసారి అందుల ఆశ్రమం సమీపించినప్పుడు, ఆయన పాడుతున్న శివతత్వ గీతాలు విని, అందులో ఒకరు "ధరణి గారు" అని వాయిస్ గుర్తించి పిలవడం తనని ఆశ్చర్య ఆశ్చర్యపరిచింది అన్నారు.అప్పుడు తాను శివతత్వం మీద అప్పటికప్పుడు ఆశువుగా చెప్పిన కవిత... వారికి ఊరట కలిగించింది.ఎలాగంటే కళ్ళు లేవని మీరు బాధపడకండి, పాపిష్టి లోకం మీరు చూడలేరని , నేను కళ్ళు మూసుకున్నానుమీకు కళ్ళు కనపడకుండా చేశాను. మీరు బాధపడకండి.. అని ఓదార్చిన తీరుగా శివతత్వం చెప్పినప్పుడు వారిలో మానసిక ఆనందాన్ని కలిగింది అన్నారు తనికెళ్ల భరణి. ఎంతో షూటింగ్ బిజీలో ఉండి కూడా, ఈ పుస్తక సంబంధిత వివరాలు ఇండ్ల రామసుబ్బారెడ్డి తెలియపరచడంతో ప్రత్యేకంగా పుస్తక ఆవిష్కరణకు వచ్చాను అని, నిరంజన్ తల్లిదండ్రులని అభినందిస్తూ.. పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తున్న రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకావిష్కరణ సభకు అధ్యక్షత వహించిన ప్రఖ్యాత మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ....మంచి సామాజిక ప్రయోజనం ఉన్న పుస్తకం రాసిన తను చిన్ననాటి స్నేహితుడు ప్రతాప్ రాజుల పల్లి నీ అభినందిస్తూ తానే ముందుమాట రాశాను అన్నారు.రవీంద్రభారత్ అనే ఒక తండ్రి మూగ చెవుడు అయినా తన కుమారుడి ( నిరంజన్ )కోసం తన భార్య (దీప) తో కలసి చిన్న వయసు నుండే ఆ అబ్బాయికి మాటలు నేర్పించి, చివరకు అతడిని బీటెక్ కూడా పాస్ అయ్యేందుకు కృషి చేశారు. ఈ విజేత కథ నే... రవీంద్ర బట్ కన్నడంలో చిన్న పుస్తకంగా రాస్తే; మన ప్రతాప్ రాజుల పల్లి తెలుగులో కేవలం ఒక అనువాదంగా కాక లాగా తీర్చిదిద్దిన తీరు అభినందనీయం అన్నారు. ప్రతాప్ రాసిన" మూడో చెవి" పుస్తకం చదివితే, ఒకరిపై ఆధారపడకుండా తల్లిదండ్రులే శిక్షకులుగా మారి పిల్లలకు వారే శిక్షణ ఇచ్చి, వారిని మామూలు పిల్లలుగా ఎలా తయారు చేయవచ్చు నో.. ఇది చదివిన ప్రతి ఒక్కరికి అర్థం అవుతుందని అన్నారు. ఈ పుస్తకాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన రచయిత ప్రతాప్ ను మన పూర్వకంగా అభినందించారు.నవజాత శిశు వైద్య నిపుణులు, విశ్రాంత సూపరింటెండెంట్ కర్నూలు వైద్య కళాశాల, డాక్టర్ హనుమంత రాయుడు పుస్తకానికి వ్రాసిన మలి మాటల్లో.. రవీంద్ర కథారూపంగా చెవిటి పిల్లల తల్లిదండ్రులకు ప్రతిదీ అర్థమయ్యేటట్లు చెప్పారు. రచనల్లో కొందరు వినోదం కోసం రాస్తారు. కొందరు వికాసం కోసం రాస్తారు. కాగా మరికొందరు లోకకళ్యాణం కోసం రాస్తారు. తెలుగు అనువాదం చేసిన ప్రతాప్, కన్నడ మూలం రవీంద్ర బట్; వీరిద్దరూ కడపటి వర్గానికి చెందిన వారిగా భావిస్తాను అంటూ ప్రశంసించారు.క్రమబద్ధమైన తర్ఫీదునిచ్చి కుమారుని జీవితములో వెలుగు నింపిన అమ్మ " దీప" నిజంగా నిరంజన్ ను తీర్చిదిద్ది విజేతగా నిలపటం ఈ పుస్తక విశేషం అని రచయిత ప్రతాప్ రాజుల పల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో నవజాత శిశు వైద్యులు డాక్టర్ హనుమంతరాయుడు.విశిష్ట అతిథి,తొలి ప్రతి స్వీకర్త శ్రీ మాదిరెడ్డి కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి, తెలుగు కళా సమితి ,నవీన్ ముంబై. శ్రీ రవీంద్ర బట్ కన్నడ మాతృక రచయిత, కార్యనిర్వాహక సంపాదకులు ప్రజావాణి ప్రముఖ కన్నడ దినపత్రిక పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతిని చాటి చెప్పేదే తీజ్ పండగ

**- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ.**

విశ్వంభర, ఎల్బీనగర్ : గిరిజన సంస్కృతిని చాటి చెప్పేది తీజ్ పండగ అని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆదివారం ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తిలో గుడి పూజారి బాలునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ కరవు నుండి, కాపాడే ప్రకృతి పండుగ తీజ్ అని అన్నారు. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదవ రోజు నిమజ్జనం చేస్తారు అని ఈ ఉత్సవాలను పెళ్ళికాని ఆడపిల్లలే నిర్వహిస్తారు అని అన్నారు. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే.. తీజ్ లో గోధుమ మొలకలను పూజించడం లంబాడీల ఆనవాయితీ అని ఆగస్టు నెలలో ఈ వేడుకలు మొదలువుతాయి. బంజారాల సంస్కృతికి దర్పణం ఈ తీజ్ ఉత్సవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి, జాహిద్, కృష్ణా నాయక్, దశరధ నాయక్, శీను నాయక్, శుక్రు నాయక్, దశ్రు నాయక్, రవి నాయక్, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.





## మోహన్‌లాల్‌కు అస్వస్థత.. ఆస్పత్రిలో చికిత్స

**విశ్వంభర, ఇంటర్నెట్ డెస్క్ :** మాలీవుడ్ స్టార్ మోహన్ లాల్‌కి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోహన్ లాల్ అస్వస్థతకి గురి కావడంతో కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయనకి చికిత్స అందిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తీవ్ర జ్వరం, శ్వాస సంబంధిత సమస్య, కండరాల నొప్పితో ఆయన బాధపడుతుండటంతో ఆసుపత్రిలో చేర్చినట్లు తెలుస్తోంది. ఈ వార్త వైరల్ కావడంతో ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు.

త్వరగా కోలుకోవాలంటూ

మోహన్ లాల్ హెల్త్ బులెటిన్ అంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం బయటికొచ్చింది. ఆ మెడికల్ సర్టిఫికెట్ పై ఆగస్టు 16 తేదీ ఉంది. 64 ఏళ్ల మోహన్ లాల్ తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, సాధారణ మైయాల్జియాతో బాధపడుతున్నారని అందులో డాక్టర్ రాశారు. అలానే ఆయనకి వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు డాక్టర్ గిరీష్ కుమార్.. మోహన్ లాల్‌కి మందులు ఇచ్చి చికిత్స చేస్తున్నారు. ఐదు రోజుల విశ్రాంతి తీసుకోవాలని.. రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం మోహన్‌లాల్ ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిసింది.

ఇక ఈ వార్త తెలిసిన ఫ్యాన్స్ మోహన్ లాల్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. మరోవైపు ఆయన స్వీయ దర్శకత్వంలో చేసిన 'బరోజ్' చిత్రం అక్టోబర్ 3న రిలీజ్ కాబోతుంది. ఆయన కెరీర్‌లో మెగాఫోన్ పట్టుకోవడం ఇదే మొదటిసారి. మరోవైపు మోహన్ లాల్ బ్లాక్ బస్టర్ సినిమా 'మణిచిత్రతాళు' రిరిలీజ్ కాగా ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. శోభనతో కలిసి మోహన్ లాల్ చేసిన ఈ సినిమా అప్పట్లో సంచలన విజయం సాధించింది. చంద్రముఖి సినిమాకి ఇదే ఒరిజినల్ వెర్షన్. ఈ సినిమాలో నటనకి గాను శోభనకి నేషనల్ అవార్డు కూడా దక్కింది. ఇక కెరీర్ విషయానికొస్తే మోహన్ లాల్ ప్రస్తుతం బరోజ్‌తో పాటు 'ఎల్ 2' చిత్రంలో కూడా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పృథ్వీరాజ్ సుకుమారన్ డైరెక్ట్ చేస్తున్నారు. లూసిఫర్ చిత్రానికి ఇది సీక్వెల్ అని టాక్ ఉంది. అలాన్ రామ్, వృషభ, కన్నప్ప సినిమాలు కూడా మోహన్ లాల్ చేతిలో ఉన్నాయి. ఇందులో కన్నప్ప సినిమాలో ఆయన అతిథిపాత్రలో నటిస్తున్నారు. ఇక ఈ ఏడాది ఇప్పటికే మలైకోట్టై వాలిబన్ చిత్రంతో ఆడియన్స్‌ను పలకరించారు లాల్ ఏట్టన్. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచింది . ఇక రీసెంట్‌గా 'మనోరథంగల్' అనే వెబ్ సిరీస్ కూడా రిలీజైంది. ఇందులో కూడా కీలకపాత్రలో మోహన్ లాల్ నటించారు.

## పాఠశాల విద్యను బలోపేతం చేయాలి

విశ్వంభర, అమరావతి: పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన రాష్ట్ర విద్యా సదస్సులో అయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న జీవోలను వీలైనంత త్వరగా రద్దు చేయాలని కోరారు. ఒకే సిలబస్ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. పురపాలక ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీన అంశంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి ధరలు



**విశ్వంభర, హైదరాబాద్:** మరోసారి ఉల్లి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. కొంత కాలం క్రితం ఉల్లి ధరలు ఆకాశాన్ని తాకాయి. ఢిల్లీలో కొన్నేళ్ల క్రితం ప్రభుత్వాలే ఉల్లి ధరలకు పతనం అయ్యాయి. ఇప్పుడు మార్కెట్ లో చోటు చేసుకుంటున్న పరిణామాలతొ ఉల్లి ధరలు మరోసారి పెరిగాయి. నిన్న మొన్నటి వరకూ కిలో ఇరవై నుంచి ముప్పయి రూపాయలు పలికిన కిలో ఉల్లి ధర ఇప్పుడు యాభై రూపాయలకు చేరుకుంది. మరి కొద్ది రోజులు ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. మొన్నటి వరకూ టమాటా ధరలు చుక్కలుచూపించగా, ఇప్పుడు ఉల్లి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఉల్లి వినియోగం ఎక్కువగా ఉండటంతో డిమాండ్ కూడా అధికంగానే ఉంటుంది. నిన్న మొన్నటి వరకూ కిలో ఇరవై నుంచి ముప్పయి రూపాయలు పలికింది. ఇప్పుడు హైదరాబాద్ తో సహా ఏపీలో విశాఖ, విజయవాడ, కర్నూలు మార్కెట్ లోనూ రూ 50 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ధరలు పెరుగుతుండటంతో వ్యాపారులు ప్రస్తుత డిమాండ్ ను సొమ్ము చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.ప్రస్తుతం ధరలు పెరగటానికి ప్రధాన కారణం ఉల్లి సాగు విస్తీర్ణం తగ్గడమే కారణమని చెబుతున్నారు. సాధారణంగా ఉల్లిపాయల ధరలు సెప్టంబరు నుంచి పెరుగుతుంటాయి. కానీ ఒకనెల ముందుగానే షాకిస్తుంది. మహారాష్ట్రలో ఉల్లిపంట దెబ్బ తినడంతో పాటు దిగుమతి కూడా తగ్గింది. కర్నూలు మార్కెట్ లో ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఉల్లిసాగు ఎక్కువగా ఉంటుంది. కానీ ఏటా 30 వేల హెక్టార్లల పండే ఉల్లి ఈసారి తొమ్మిది వేల హెక్టార్లకే పరిమితమయ్యింది. కర్నూలు ఉల్లి మార్కెట్ లో క్వింటాల్ ధర మూడు వేల రూపాయల ఐదు వందల రూపాయల వరకూ పలుకుతుంది. అయితే, నెలాఖరు వరకు ఉల్లి ధరలు అధికంగా ఉంటాయని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

## కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుంది

**ట్రంప్ విమర్శలు**




**న్యూయార్క్:** డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ భయంకరంగా నవ్వుతుందని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్వ్యాఖ్యానించారు.ఆయన పెన్సిల్వేనియాలోని విల్కెస్‌బారేలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కమలా హారిస్పై తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతోపాటు.. అమెరికాలోని ప్రధాన పత్రికలను కూడా తప్పుపట్టారు. కమలా హారిస్ నవ్వడంపై నిషేధం ఉందని వ్యాఖ్యానించారు. దీంతో ఆమె నోరు మూసుకుని తిరుగుతోందని.. ఆమె నవ్వాలని.. తాను కూడా అదే కోరుకుంటున్నానని వెటకారంగా పేర్కొన్నారు. టైమ్ మ్యాగజైన్ వద్ద కమలా హారిస్ ఫొటోలే లేవని ఎద్దేవా చేశారు. వారి కళాకారులు మాత్రం ఆమె డ్రాయింగ్ వేస్తారన్నారు. కమలా ఏ విషయాన్నైనా చెత్తగా చెబుతారని ట్రంప్ విమర్శించారు. ఆమె మాటల్లోనే అబద్ధాలు దొరికిపోతాయని పేర్కొన్నారు. అమెరికాలో ఉద్యోగాలు పెంచడానికే విదేశాలపై టారిఫ్ లు విధిస్తామన్నారు. కమలా హారిస్ మార్క్సిస్ట్ పాలసీలను అనుసరిస్తారని.. ఆమె తండ్రి కూడా మార్క్సిస్ట్ ఎకనామిక్ ప్రొఫెసరన్నారు. అమెరికా కలలను జోబైడెన్‌హారిస్ చంపేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను బైడెన్కు వ్యతిరేకంగా బరిలోకి దిగానని.. హఠాత్తుగా ఏమైందో కానీ.. ఇప్పుడు హారిస్పై పోటీ చేస్తున్నానన్నారు. అమెరికాలోని ఏబీసీ సంస్థ ఎన్బీసీ, సీబీసీ, సీఎన్ఎన్ కంటే అత్యంత దారుణమైందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇక సీఎన్ఎన్ ఊళ్లో రెండో ప్రపంచ యుద్ధం వచ్చినా.. అంతాబాగానే ఉందని చెబుతుందన్నారు. ఆ సంస్థ విలేకరిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి..!**

**విశ్వంభర, బెంగళూరు:** కర్ణాటకలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గడక్ జిల్లా నరగుంద తాలూకలో ఆదివారం జరిగింది. కర్ణాటక ఆర్టీసీ బస్సుకారును ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతులను రుద్రప్ప అంగడి (58), భార్య రాజేశ్వరి (50), కుమార్తె ఐశ్వర్య (18), కుమారుడు విజయ్ కుమార్ (14)గా గుర్తించారు. వీరి స్వస్థలం హావేరి జిల్లా మారుతీనగర్ వాసులుగా గుర్తించారు. మృతుల కుటుంబాలకు బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై సంతాపం ప్రకటించారు. ప్రమాదంపై విచారణ జరిపించాలని.. పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అన్న క్యాంటీన్లకు రూ.కోటి విరాళం ఇచ్చిన మాజీ ఎంపీ

**విశ్వంభర, అమరావతి :** మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఏపీలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.కోటి విరాళం ఇచ్చారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ను కలిసి చెక్కు అందజేశారు. విరాళం ఇచ్చిన గోకరాజు గంగరాజుకు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి వివిధ భాగస్వాములు కలిసి వస్తున్నారన్నారు.



# చిరకాల ప్రత్యర్థులు ఏకతాటిపైకి..

**కోల్‌కతాలో అరుదైన పరిణామం**

**కోల్‌కతా:** కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలుకొనసాగుతున్నాయి. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేయగా.. మరోవైపు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు విచారణకు సిద్ధమైంది. ఇదే సమయంలో కోల్‌కతాలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ఫుట్బాల్లో చిరకాల ప్రత్యర్థులుగా ఉన్న రెండు గ్రూపులు ఏకతాటిపైకి వచ్చి.. కోల్కతా ఘటనపై భారీ ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. అయితే, భద్రత కారణాల దృష్ట్యా వారి ప్రయత్నాలను కోల్కతా పోలీసులు అడ్డుకున్నారు.ఆర్జీకర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనతో కోల్కతా అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో ఫుట్బాల్ (Kolkata Derby) లో చిరకాల ప్రత్యర్థులుగా పేరొందిన ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ క్లబ్లు ఒక్కతాటిపైకి వచ్చాయి. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ఫుట్బాల్ క్లబ్లుగా ప్రసిద్ధి చెందిన ఈ రెండు బృందాలకు చెందిన వందలాది మంది మద్దతుదారులు సాల్ట్ లేక్ స్టేడియం వద్దకు చేరుకున్నారు.వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. మరో ఫుట్బాల్ క్లబ్ మద్దతుదారులు కూడా వచ్చి చేరారు. ఇలా మూడు క్లబ్ల అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో అప్రమత్తమైన పోలీసులు పెద్దఎత్తున బలగాలను రంగంలోకి దించారు. వారిని నిలువరించేందుకు యత్నించినప్పటికీ.. ఆందోళనకారులు ముందుకు సాగారు. ఇదే సమయంలో ఆల్ ఇండియా ఫుట్బాల్ ఫెడరేషన్ (AIFF) అధ్యక్షుడు కల్యాణ్ చౌబే కూడా నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కోల్కతా ఫుట్బాల్ పోటీలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. వీటిలో ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ జట్లకు వందేళ్ల చరిత్ర ఉంది. వీటి మధ్య పోటీ మ్యాచ్లను తిలకించేందుకు వేలసంఖ్యలో అభిమానులు తరలివస్తుంటారు. ఆసియాలోనే అతి పెద్ద ఫుట్బాల్ పోటీల్లో ఒకటిగా దీన్ని పరిగణిస్తారు. ఈ నేపథ్యంలోనే భద్రతా కారణాల దృష్ట్యా జరగాల్సిన మ్యాచ్ను పోలీసులు రద్దు చేశారు.



# మనీతో విపక్ష పార్టీల ధ్వంసానికి బీజేపీ యత్నం..

**జార్ఖండ్ సీఎం సోరెన్ మండిపాటు..!**

**జార్ఖండ్:** కేంద్రంలోని అధికార బీజేపీపై జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను డబ్బు సంచులతో కొని విపక్షాలను దెబ్బ తీయాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. తనకు అత్యంత సన్నిహితుడైన మాజీ సీఎం చంపై సోరెన్.. బీజేపీలో చేరేందుకు ఢిల్లీకి వెళ్లారన్న వార్తల నేపథ్యంలో హేమంత్ సోరెన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.'వారు ఇండ్లు కూల్చేయడంలో, రాజకీయ పార్టీలను ధ్వంసం చేయడంలో బిజీగా ఉన్నారు. ఒక రోజు వారు ఈ ఎమ్మెల్యేను కొనుగోలు చేయొచ్చు. మరుసటి రోజు మరొకరిని కొనుగోలు చేయొచ్చు. కానీ ఎల్లకాలం నాయకులను డబ్బు ప్రలోభ పెట్టలేదు. 2019 నుంచి రాష్ట్రంలోని ఇండియా కూటమి సంకీర్ణ ప్రభుత్వం.. జార్ఖండ్ ప్రజలతో కలిసి గట్టిగా ఉంది' అని సభలో మాట్లాడుతూ చెప్పారు. అధికార జేఎంఎంలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని, మాజీ సీఎం చంపై సోరెన్ బీజేపీలో చేరనున్నారని వచ్చిన వార్తల నేపథ్యంలో హేమంత్ సోరెన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.సీఎం హేమంత్ సోరెన్‌కు మాజీ సీఎం చంపై సోరెన్ అత్యంత సన్నిహితుడు. భూ ఆక్రమణ కేసులో అరెస్టయినప్పుడు హేమంత్ సోరెన్ స్థానే జార్ఖండ్ సీఎంగా చంపై సోరెన్ బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఆ కేసులో బెయిల్ మీద బయటకు వచ్చిన హేమంత్ సోరెన్‌ను సీఎంను చేసేందుకు చంపై సోరెన్ తన పదవికి రాజీనామా చేశారు. అర్ధంతరంగా తనను సీఎం పదవి నుంచి తప్పించడంపై చంపై సోరెన్ కినుక వహించారని వదంతులు వినిపిస్తున్నాయి. సీఎంగా తనను వైదొలగాలన్న తీరు బాధ కలిగించిందని చంపై సోరెన్ ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.



# నేడు వినీలాకాశంలో కనువిందు చేయనున్న సూపర్ బ్లూమూన్..!

**విశ్వంభర, హైదరాబాద్:** వినీలాకాశంలో ఓ అరుదైన దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. సోమవారం సూపర్ బ్లూ మూన్ ఆవిష్కృతం కాబోతున్నది. సాధారణంగా ఒక ఏడాదిలో రెండు, మూడు సూపర్ మూన్స్ ఏర్పడుతుంటాయి. బ్లూ మూన్ మాత్రం అరుదుగా ఏర్పడుతుందని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా పేర్కొంది. అయితే, ఈ సారి మాత్రం సూపర్ మూన్, బ్లూ మూన్ కలయికలో సూపర్ బ్లూ మూన్ దర్శనం ఇవ్వబోతున్నది. పౌర్ణమి గడియల్లో చందమామ 90శాతం భూమికి దగ్గరగా వచ్చిన సూపర్ మూన్ ఆవిష్కృతమవుతుంది. దాంతో సాధారణంగా పౌర్ణమి రోజుల కంటే సూపర్ మూన్ సమయంలో చంద్రుడు మరింత ప్రకాశవంతం ఉండడంతో పాటు భారీ పరిమాణంలో కనిపిస్తాడు. నాలుగు పౌర్ణమిలలో మూడో పౌర్ణమి రోజున బ్లూ మూన్ ఏర్పడుతుంది. అయితే, బ్లూ మూన్ అంటే నీలం రంగులో మాత్రం కనిపించదు.

కానీ, సాధారణంగా బ్లూ మూన్ అని పిలుస్తుంటారు. సూపర్ మూన్, బ్లూ మూన్ రెండూ ఒకేసారి రావడం అరుదుగా జరుగుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ సారి సూపర్ బ్లూ మూన్ అనేది భారతీయులకు ఎంతో ముఖ్యమైన రాఖీ పండుగ రోజున రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, 1979లో రిచర్డ్ నోల్లెచే సూపర్ మూన్ అనే పదాన్ని పరిచయం చేశారు. 2024లో వరుసగా సూపర్ మూన్‌లు ఆవిష్కరం కాబోతున్నాయి. ఇందులో రాఖీ పండుగ రోజున ఒకటి దర్శనం ఇవ్వనుండగా.. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లోనూ సూపర్ మూన్‌లో కనిపించనున్నాయి. పౌర్ణమి రోజు 25శాతం సూపర్ మూన్‌లు ఏర్పడితే 3శాతం మాత్రమే బ్లూ మూన్స్ ఆవిష్కృతమవుతాయి. ఇక ఈ రెండింటి కలయికలో ఇంకా అరుదుగా వస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మళ్లీ సూపర్ మూన్, బ్లూ మూన్ రెండింటి కలయికలో 2037 సంవత్సరంలో దర్శనం ఇచ్చే అవకాశం ఉందని అంచనా. నాసా ప్రకారం అప్పుడప్పుడు పొగ, ధూళి తదితర చిన్న చిన్న కణాలు కాంతి ఎరుపు తరంగ దైర్ఘ్యాలను చెదరగొడుతుంటాయి. దాంతో చంద్రుడు నీలం రంగులో కనిపిస్తాడు.



# సాల్ట్‌లేక్ స్టేడియం వద్ద నిరసన ప్రదర్శన



**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియం సమీపంలో ఈ ఘటనను ఖండిస్తూ ఆదివారం పెద్దసంఖ్యలో మహిళలు, యువత నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ దారుణానికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి ఉరి తీయాలని ఈ సందర్భంగా నిరసనకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, తమ కూతురిని వైద్యురాలిని చేసేందుకు తామెంతో కష్టపడ్డామని, చివరకు ఆమెను కిరాతకంగా హత్య చేశారని కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ ఆస్పత్రి ఘటనలో బాధితురాలి తల్లి ఆందోళన వ్యక్తం చేశారు. దోషిని వీలైనంత త్వరలో అరెస్ట్ చేస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ ఇచ్చినా ఇంతవరకూ ఏం జరగలేదని విచారం వ్యక్తం చేశారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారని, అయితే ఈ ఘటనలో పలువురి ప్రమేయం ఉందని తాను భావిస్తున్నాన్‌ని చెప్పారు.ఈ ఘటనకు మొత్తం డిపార్ట్‌మెంట్ బాధ్యత వహించాలని ఆమె పేర్కొన్నారు. పోలీసులు సరైన రీతిలో స్పందించలేదని ఆరోపించారు. తమ కూతురి హత్యాచార ఘటనపై పెల్లుబుకిన నిరసనను చల్లార్చేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని తాను భావిస్తున్నానని అన్నారు. ప్రజలు నిరసన చేపట్టకుండా నిరోధించేందుకు ఈరోజు 144 సెక్షన్ విధించారని అన్నారు.

## జనాభా నియంత్రణపై శ్రద్ధ చూపలేదు

**ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి**



**విశ్వంభర, ఢిల్లీ:** జనాభా పెరుగుదల దేశానికి అతిపెద్ద సవాల్ గా మారిందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి తెలిపారు. ఎమర్జెన్సీ కాలం నుంచి జనాభా నియంత్రణపై దేశ ప్రజలు శ్రద్ధ చూపలేదని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్జ్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మూర్తి ఈమేరకు ప్రసంగించారు."జనాభా, తలసరి భూమి లభ్యత, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలకు సంబంధించిన విషయాల్లో భారత్ పెను సవాళ్లను ఎదుర్కొంటోంది. ఎమర్జెన్సీ సమయం నుంచి జనాభా నియంత్రణపై మనం తగినంత దృష్టి సారించలేదు. ఇది దేశాన్ని అస్థిరంగా మార్చే ప్రమాదం ఉంది. అమెరికా, బ్రెజిల్, చైనా వంటి దేశాల్లో తలసరి భూమి లభ్యత చాలా ఎక్కువగా ఉంది. భారత్లో ఆ పరిస్థితి లేదు" అని మూర్తి పేర్కొన్నారు.దేశ ప్రగతికి తోడ్పడటం నిజమైన వృత్తినిపుణుడి బాధ్యత అని నారాయణమూర్తి చెప్పారు. ఉన్నత ఆకాంక్షలు, కలలను నెరవేర్చుకునేందుకు చేసే కృషిపై ఇది ఆధారపడి ఉంటుందన్నారు. "భవిష్యత్తు తరాల బాగు కోసం ఒక తరం ఎన్నో త్యాగాలు చేయాలి. నా ప్రగతి కోసం నా తల్లిదండ్రులు, తోబుట్టువులు, ఉపాధ్యాయులు ఎన్నో త్యాగాలు చేశారు. అవి వృథా కాలేదనడానికి.. ముఖ్య అతిథిగా నేను ఇక్కడికి రావడమే నిదర్శనం" అని తెలిపారు.

## వైద్యుల భద్రత కోసం ప్రత్యేక బిల్లు : శశి థరూర్ డిమాండ్



**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో జరిగిన దుర్ఘటనతో దేశం ఉలిక్కిపడింది. వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. వైద్యుల పట్ల తాను సానుభూతి వ్యక్తం చేస్తూ వారికి సంఘీభావం తెలుపుతున్నానని చెప్పారు.వైద్యులపై జరుగుతున్న హింస గురించి తాను గత రెండేండ్లుగా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నానని, ఈ అంశంపై అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో వాదన జరిగిందని గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో ఉండే వైద్యుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బిల్లును తీసుకురావాలని తాను వాదించానని చెప్పారు. తనకు ప్రభుత్వం నుంచి విచిత్రమైన సమాధానం వచ్చిందని చెప్పారు.ఒక వృత్తికి ఇలాంటి భద్రతతో కూడిన బిల్లును తీసుకువస్తే ఇతరుల కోసం కూడా ఇలా చేయాల్సి వస్తుందని ప్రభుత్వం బదులిచ్చిందని అన్నారు. ఇది ఏమాత్రం అర్థం లేని వాదన అన్నారు. ప్రజల్లో ఇలాంటి విషయాలపై అవగాహన పెంచే ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలోనే మనం మరో వైద్యురాలిని కోల్పోవడం తనను బాధించిందని శశి థరూర్ విచారం వ్యక్తం చేశారు.

## తిరుమలలో విస్తృతంగా విజిలెన్స్, పోలీసుల తనిఖీలు

**విశ్వంభర, తిరుమల :** తిరుమలలోని బాలాజీ నగర్ వెనుక భాగంలో ఉన్న కార్మికుల నివాసాలపై పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. తిరుమలలో వివిధ నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేసిన కార్మికుల కోసం తాత్కాలిక షెడ్ల ను వారి నివాసం కోసం టీటీడీ ఏర్పాటు చేసింది. పనులు పూర్తయి, కాంట్రాక్టర్ వెళ్లిపోయినప్పటికీ, ఇప్పటికీ 70 కి పైగా షెడ్లలో కార్మికులు తిరుమలలో ఉంటున్నారు. ఇందులో కొంతమంది అనధికార వ్యక్తులు కూడా ఉండడంతో టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశాల మేరకు టీటీడీ విజిలెన్స్, భద్రతా సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు.తిరుమల భద్రతను దృష్టిలో ఉంచుకుని విజిలెన్స్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించిన కార్మికుల జాబితాను తయారు చేసి ధృవీకరణ కోసం ఇంజినీరింగ్ విభాగానికి పంపారు. అనధికారికంగా ప్రవేశించే వారిని నిలువరించేందుకు ఇకపై ఇలాంటి దాడులు నిరంతరాయంగా కొనసాగిస్తామని అధికారులు వివరించారు. తిరుమలలో అనధికారికంగా నివసిస్తున్న వ్యక్తులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఆ రెండు ఫైనల్స్ మధ్య 15 రోజుల గ్యాప్

**విశ్వంభర, క్రీడావిభాగం:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL 2025) సీజన్-18 మార్చి చివరి నాటికి ప్రారంభం కావడం దాదాపు ఖాయమైంది. ఎందుకంటే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నమెంట్ చివరి మ్యాచ్ మార్చి 9న జరుగుతుంది. ఈ టోర్నమెంట్ తర్వాత IPL 2025 ప్రారంభమవుతుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 చివరి మ్యాచ్‌ను జూన్ నెలలో లార్డ్స్ మైదానంలో నిర్వహించాలని ICC నిర్ణయించింది. అంటే, మార్చిలో ఐపీఎల్ ప్రారంభమైతే బీసీసీఐ జూన్ లోపు టోర్నీని ముగించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఈసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో టీమిండియా ఫైనల్‌లో తలపడడం దాదాపు ఖాయం. ప్రస్తుతం టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా.. వచ్చే 10 టెస్టుల్లో భారత్ నాలుగైదు మ్యాచ్‌లు గెలిచినా.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు చేరుకుంటుంది. ఆ విధంగా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు 2 వారాల ముందు ఐపీఎల్‌ను ముగించాలని బీసీసీఐ ప్లాన్ చేసింది. 2023 డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై టీమ్ ఇండియా తడబడింది. ఐపీఎల్ తర్వాత మళ్లీ టెస్టుల్లోకి అడుగుపెట్టిన భారత ఆటగాళ్లు ఓటమి పాలయ్యారనే విమర్శలు వినిపించాయి. అయితే, ఈసారి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు 15 రోజుల ముందు ఐపీఎల్ ఫైనల్‌ను నిర్వహిస్తామని బీసీసీఐ సెక్రటరీ జై షా తెలిపారు. అంటే ఐపీఎల్ ఫైనల్, డబ్ల్యూటీసీ ఫైనల్ మధ్య 15 రోజుల గ్యాప్ ఉంటుంది. ఈ రెండు వారాల్లో టీమ్ ఇండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సిద్ధమవుతుంది. దీని ద్వారా తొలిసారి డబ్ల్యూటీసీకి పట్టం కట్టేందుకు బీసీసీఐ ప్లాన్ వేసింది.




## నేను గెలవని సిరీస్ అదొక్కటే..

### కమిన్స్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

**విశ్వంభర, క్రీడావిభాగం :** గత రెండు సార్లు ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోల్పోయిన ఆసీస్ జట్టు ఈసారి ఎలాగైనా ట్రోఫీని సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే ఆ దిశగా ఆటగాళ్లు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత జరిగిన స్కాట్లాండ్, ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. తాజాగా బ్రేక్ టైమ్‌ను మరో రెండు నెలలు పొడిగించుకోవాలని అతడు భావిస్తున్నాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసమే.. మరో 8 వారాల పాటు కమిన్స్ విశ్రాంతి తీసుకోవాలని భావిస్తున్నాడని తెలుస్తోంది. ఆస్ట్రేలియా తరఫున విజయవంతమైన కెప్టెన్‌లలో ఒకడిగా కమిన్స్ నిలిచాడు. స్టీవ్ స్మిత్ తర్వాత సారథ్య బాధ్యతలు అందుకుని సమర్థవంతంగా జట్టును నడిపిస్తున్నాడు. తన కెప్టెన్సీలో ఆస్ట్రేలియాకు ప్రపంచ టెస్టు ఛాంపియన్స్ షిప్-2 టైటిల్‌తో పాటు వన్డే వరల్డ్ కప్ టైటిల్‌ను సైతం అందించాడు. ఇదే సమయంలో గత కొన్నేళ్లుగా అందని ద్రాక్షగా మారిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీని సైతం సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కమిన్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "క్రీడాకారులు ఎవరైనా బ్రేక్ తీసుకుని వచ్చాక ఫ్రెష్‌గా కనిపిస్తారు. ఆటకు దూరమయ్యామని బాధ పడాల్సిన అవరరం లేదు. గతేడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ నుంచి నేను విరామం లేకుండా క్రికెట్ ఆడుతున్నా. సుమారు ఏడాదిన్నర కాలం పాటు బ్రేక్ అనేది లేకుండా ఆడుతున్నా. ఇప్పుడు నేను తీసుకునే 7-8 వారాల విశ్రాంతి నా శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో మళ్లీ చెలరేగేందుకు అవసరమైన శక్తిని పొందగలుగుతా. గాయాల బారిన పడకుండా కూడా ఉంటాను" అని కమిన్స్ చెప్పుకొచ్చాడు. "బోర్డర్ గావస్కర్ ట్రోఫీని నేను ఇప్పటివరకూ గెలవలేదు. ప్రస్తుత ఆస్ట్రేలియా జట్టులోని చాలా మంది ఈ ట్రోఫీని నెగ్గలేదు. దీంతో స్వదేశంలో జరిగే ఈ ట్రోఫీని ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ఉన్నాం. భారత్‌తో మేం చాలా క్రికెట్ ఆడాము. వాళ్ల ఆట ఏంటి అనేది మాకు తెలుసు. మేం ఈసారి మెరుగైన ప్రదర్శన చేస్తాం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీ గెలుచుకుంటాం" అని ఆస్ట్రేలియా కెప్టెన్ విశ్వాసం వ్యక్తం చేశాడు. కాగా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. 2017 నుంచి భారత్ ఈసిరీస్‌ను కాపాడుకుంటూ వస్తోంది. రెండు పర్యాయాలు ఆస్ట్రేలియాలో.. మరో రెండు సార్లు భారత్‌లో ఈ సిరీస్ గెలిచింది టీమిండియా. దీంతో ఎలాగైనా ట్రోఫీని ఒడిసిపట్టాలని ఆస్ట్రేలియా ఉవ్విళ్లూరుతోంది. నవంబర్ 22 నుంచి బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. 1992 తర్వాత తొలిసారిగా ఈ సిరీస్‌లో ఐదు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి.

## వినేశ్ ఫొగాట్‌కు అపూర్వ స్వాగతం



**విశ్వంభర, క్రీడావిభాగం :** కేవలం 100 గ్రాముల బరువు ఎక్కువుందనే కారణంతో ఒలింపిక్(Paris Olympics 2024) రెజ్లింగ్ పోటీల్లోంచి స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ని తొలగించిన విషయం తెలిసిందే. కాస్ కూడా అనుకూల తీర్పు ఇవ్వకపోవడంతో స్వదేశానికి పయనమైన వినేశ్ ఆదివారం తన స్వగ్రామానికి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన అనంతరం ఆమె హరియాణా చర్కీ దాద్రీ జిల్లా బలాలికి బయల్దేరారు. ఢిల్లీ నుంచి బలాలికి చేరుకోవడానికి సుమారు 10 గంటల సమయం పట్టింది. గ్రామానికి చేరుకున్న అనంతరం వినేశ్‌కి గ్రామస్థులు అపూర్వ స్వాగతం పలికారు. ఆమెకు ప్రైజ్‌మనీ ఇచ్చారు. ఓ వాచ్‌మెన్ కూడా వినేశ్ కోసం రూ.100 ఇచ్చాడు. గ్రామస్థులంతా కలిసి రూ.21 వేలు ఆమెకు బహుమతిగా అందజేశారు. ఇది పెద్ద మొత్తం కాకపోయినా.. వారి ప్రేమాభిమానాలపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైజ్‌మనీతోపాటు 750 కిలోల లడ్డూలనూ ఆమెకు అందజేశారు. వాటిని ఊరంతా పంచారు. గ్రామస్థుల అభిమానం, ప్రేమపట్ల వినేశ్ భావోద్వేగానికి లోనయ్యారు. అంతకుముందే ఆమెకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. అనంతరం నిర్వహించిన ర్యాలీలో రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ తదితరులు పాల్గొన్నారు.


**దేశ ప్రజలకు కృతజ్ఞతలు...**

విమానాశ్రయంలో దిగిన వెంటనే ఆమె మీడియాతో భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు అని విమానాశ్రయంలో తనను స్వాగతించిన వారినుద్దేశించి వినేశ్ అంది. అక్కడినుంచి ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా బయలుదేరింది. 100 గ్రాముల అధిక బరువుందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్‌నుంచి వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్వాహకుల నిర్ణయాన్ని ఆమె క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో సవాలు చేస్తూ తనకు రజత పతకం ప్రకటించాలని కోరింది. దానిపై విచారణ, తీర్పు తదితరాల నేపథ్యంలో పారిస్ నుంచి వినేశ్ రాక ఆలస్యమైంది. విమానాశ్రయం నుంచి తన అభిమానులు పలు వాహనాల్లో వెంటరాగా హరియాణాలోని స్వస్థలం బలాలీకి వినేశ్ బయలుదేరింది. ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో గల ఓ ఆలయంలో వినేశ్ పూజలు నిర్వహించింది. మార్గమధ్యంలోపలు ప్రాంతాల్లో తనకోసం వేచివున్న మద్దతుదారులను ఆమె కలుసుకుంది. ఢిల్లీ సమీపంలోని బద్లీ గ్రామ వాసులు వినేశ్‌కు అపూర్వ స్వాగతం పలికారు. అది చూసి తీవ్ర భావోద్వేగానికి లోనైన వినేశ్ కంటతడి పెట్టుకుంది. ఈ సందర్భంగా భర్త సోమ్‌వీర్.. వినేశ్‌ను ఓదార్చాడు. 'పారిస్ క్రీడల నిర్వాహకులు నాకు బంగారు పతకం ఇచ్చి ఉండకపోవచ్చు. కానీ మీరు నాపట్ల చూపుతున్న ప్రేమ, అభిమానం వేయి ఒలింపిక్ స్వర్ణ పతకాలకు మించినది' అని ఆమె భావోద్వేగంతో చెప్పారు.

## మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, క్రీడావిభాగం:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2025 మహిళల అండర్ -19 ప్రపంచకప్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. మలేషియా వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఈ టోర్నీని నిర్వహించనున్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్‌కు చేరుకుంటాయి. సూపర్ సిక్స్‌కు చేరుకున్న 12 జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. సెమీస్, ఫైనల్‌తో కలిపి మొత్తం 41 మ్యాచులు జరగనున్నాయి. ఇక భారత జట్టు గ్రూపు-ఏలో ఉంది. భారత్‌తో పాటు వెస్టిండీస్, శ్రీలంక, మలేసియాలు గ్రూపు-ఏలో ఉన్నాయి. ఇక గ్రూప్ బిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్, ఐర్లాండ్, యూఎస్ఏ లు ఉన్నాయి. గ్రూప్ సిలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవాలు గ్రూప్ డిలో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్, స్కాట్లాండ్ ఉన్నాయి. ఫిబ్రవరి 1 సెమీ ఫైనల్ మ్యాచ్‌లకు, ఫిబ్రవరి 3 ఫైనల్ రిజర్వ్ డేలు ప్రకటించారు. భారత్ సెమీ ఫైనల్స్‌కు వెళ్తే జనవరి 31న రెండో సెమీ ఫైనల్ ఆడునుంది. కాగా.. అండర్ 19 స్థాయిలో ఇది రెండో టీ20 ప్రపంచకప్. 2023లో తొలిసారిగా నిర్వహించిన ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచింది.




## దిగొచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

### బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు వేదిక మార్పు

**విశ్వంభర, క్రీడావిభాగం :** మాజీ క్రికెటర్లు, ఫ్యాన్స్ నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వెనక్కి తగ్గింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగే రెండో టెస్టుకు మ్యాచ్ వేదికను మార్చింది. తొలుత ఈ మ్యాచ్‌ను కరాచీలో నిర్వహించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ చేసింది. కానీ ప్రేక్షకులను మాత్రం మ్యాచ్ చూసేందుకు అనుమతించబోమని చెప్పుకొచ్చింది. కానీ విమర్శలు రావడంతో బోర్డు మనసు మార్చుకుంది. వేదికను కరాచీ నుంచి రావల్పిండికి మార్చింది. పాకిస్థాన్ పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్ జట్టు ఆదేశంతో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఆగస్టు 21 నుంచి తొలి టెస్టు, ఆగస్టు 30 నుంచి రెండో టెస్టు జరగాల్సి ఉంది. వాస్తవానికి తొలి టెస్టును రావల్పిండి, రెండో టెస్టును కరాచీలో నిర్వహించాలని షెడ్యూల్ చేశారు. కానీ వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కరాచీ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల ఏర్పాటు సహా.. ఇతర పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ స్టేడియంలో జరిగే రెండో టెస్టుకు ప్రేక్షకులను అనుమతించబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తొలుత వెల్లడించింది. ఈ నిర్ణయంపై ఆ దేశ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ విమర్శలు గుప్పించాడు. ప్రేక్షకులు లేకుండా మ్యాచ్ జరగడమేంటని బోర్డును ప్రశ్నించాడు. ఈ తరహా నిర్ణయాల వల్ల ప్రపంచ క్రికెట్‌లో పాకిస్థాన్ పరువు పోతుందని వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ నేషనల్ క్రికెట్ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని ముందే తెలిసినప్పుడు.. మ్యాచ్‌ను మరో స్టేడియంలో నిర్వహించవచ్చు కదా అని సూచించాడు. ప్రేక్షకులు లేకుండా మ్యాచ్ నిర్వహించడం మన దేశానికి అవమానకరమని కమ్రాన్ అక్మల్ బోర్డును ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. "పాకిస్థాన్‌లో కేవలం మూడు, నాలుగు క్రికెట్ స్టేడియాలే లేవు కదా.. చాలా స్టేడియాలు ఉన్నాయి కదా. ఫైసలాబాద్ స్టేడియంలో కూడా మ్యాచ్ నిర్వహించవచ్చు. లేదా ముల్తాన్‌లో కూడా మ్యాచ్ నిర్వహించవచ్చు. ఆ స్టేడియాలు బాగుంటాయి. ఏది ఏమైనా ప్రేక్షకులు లేకుండా టెస్టు మ్యాచ్ నిర్వహించడం సరైంది కాదు," అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీరు పట్ల అక్మల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కమ్రాన్ అక్మల్ వ్యాఖ్యలకు ఆ దేశ ఫ్యాన్స్ సైతం మద్దతు పలికారు. వేదికను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా వస్తున్న సూచనలు, విమర్శలను పాకిస్థాన్ బోర్డు పరిగణలోకి తీసుకుంది. దెబ్బకు వేదికను మార్చేసింది. తొలి టెస్టుకు వేదికైన రావల్పిండిలోనే రెండో టెస్టును సైతం నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో బంగ్లాదేశ్-పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లు కూడా రావల్పిండిలోనే జరగనున్నాయి.

## మ్యూచువల్ ఫండ్స్‌తో బంపర్ రిటర్న్స్..

**విశ్వంభర, బిజినెస్ :** మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు ఇటీవల జనాన్ని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో రిటర్న్స్ వస్తుండటం కారణంగా చెబుతున్నారు నిపుణులు. రిస్క్ కూడా స్టాక్ మార్కెట్లతో పోలిస్తే కొంత మేర తక్కువగానే ఉంటుంది. ఇతర ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ డిపాజిట్ల కంటే ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ వస్తుందని చెప్పొచ్చు. ఈక్విటీ మార్కెట్ల ఫలితాలు కూడా కొంతకాలంగా మెరుగ్గా వస్తుండటం గమనించొచ్చు. అందుకే ఇటువైపు మొగ్గుచూపేవారి సంఖ్య పెరుగుతుంది. రిస్క్ ఉన్నా కూడా లాంగ్ రన్‌లో రిస్క్ లేకుండా ఉత్తమ రిటర్న్స్ అందుకుంటున్నారు. ఇందులో స్మాల్ క్యాప్ ఫండ్స్ కొన్నేళ్లుగా మదుపరుల పంట పండిస్తున్నాయి. ఈ మ్యూచువల్ ఫండ్లు స్మాల్ క్యాప్ కేటగిరీ నుంచి షేర్లను ఎంచుకొని వాటిల్లో పెట్టుబడులు పెడుతుంటాయి.

ఈ స్మాల్ క్యాప్ కేటగిరీలో 250 షేర్లు మినహా అన్నీ ఉంటాయి. ప్రధానంగా రూ. 5 వేల కోట్ల కంటే తక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీల షేర్లలోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇతర రకాల ఈక్విటీ ఫండ్స్‌తో చూస్తే స్మాల్ క్యాప్ ఫండ్స్ కాస్త రిస్క్‌తో కూడుకున్నవి. మార్కెట్లతో




కొంత మేర సంబంధం కలిగి ఉంటాయి. అయినా 8-10 ఏళ్ల వ్యవధిలో రిటర్న్స్ ఎక్కువ ఇస్తుంటాయి.

నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ మూడేళ్లలో ఏకంగా 32.03 శాతం, ఐదేళ్లలో 38.65 శాతం రిటర్న్స్ ఇవ్వగా.. 10 సంవత్సరాల్లో చూస్తే 25.95 శాతం రాబడి ఇచ్చింది. క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ అయితే వరుసగా 31.75 శాతం, 49.87 శాతం, 22.24 శాతం మేర రిటర్న్స్ ఇవ్వడం చూడొచ్చు. ఐదేళ్ల కాలంలో రిటర్న్స్ క్వాంట్‌లోనే ఎక్కువ అని చెప్పొచ్చు. ఇంకా ఎల్ఐసీ MF స్మాల్ క్యాప్ ఫండ్‌లో అయితే 29.44 శాతం, 32.09 శాతం మేర రాబడి అందుకున్నారు ఇన్వెస్టర్లు.

## ఒకే బ్యాంక్‌లో రెండు సేవింగ్స్ అకౌంట్స్ ఉండొచ్చా..

**విశ్వంభర, బిజినెస్ :** సాధారణంగా ఆర్థిక ప్రయాణం సేవింగ్స్ అకౌంట్‌తోనే మొదలవుతుంది. అందుకే ప్రతి పొదుపు ఖాతాను ప్రాథమిక ఆర్థిక అవసరాలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. పొదుపు ఖాతాలు ఆర్థిక లక్ష్యాలు సాధించేందుకు, అత్యవసరాల కోసం వినియోగించేందుకు ఉపయోగపడతాయి. జీతం నుంచి ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే మొత్తం వరకూ అన్నీ ఇందులోకే వస్తుంటాయి. అయితే చాలా మంది ఒక బ్యాంకులో ఒక సేవింగ్స్ ఖాతాను కలిగి ఉండొచ్చనుకుంటారు. ఒకే బ్యాంకులో రెండు పొదుపు ఖాతాలనైనా ప్రారంభించవచ్చు. కచ్చితంగా చెప్పాలంటే బ్యాంకులో సేవింగ్స్ ఖాతాల సంఖ్యపై ఎలాంటి పరిమితులు లేవు. ఈ క్రమంలో ఒకే బ్యాంకులో రెండు పొదుపు ఖాతాలు ఉండడం వల్ల కలిగే లాభనష్టాలేమిటో? ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఒకే బ్యాంకులో రెండు పొదుపు ఖాతాలను కలిగి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలు

**1. ఆర్థిక నిర్వహణ**

ఒకే బ్యాంకులో ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉంటే మీ ఆర్థిక వ్యవస్థలను సులభంగా విభజించుకోవచ్చు.

**ఉదాహరణకు:** ఒక ఖాతాను రోజువారీ ఖర్చుల కోసం ఉపయోగించవచ్చు. మరో ఖాతాను అత్యవసర ఖర్చుల కోసం నగదు ఆదా చేయడానికి కేటాయించుకోవచ్చు.

**2. వడ్డీ రేట్లు**




బ్యాంకులు తరచూ వివిధ రకాల పొదుపు ఖాతాలకు భిన్నమైన వడ్డీ రేట్లను ఇస్తాయి. అందుకే రెండు ఖాతాలను కలిగి ఉండటం ద్వారా మీరు అధిక వడ్డీ రేటు లేదా అదనపు ప్రయోజనాలను పొందొచ్చు.

**ఉదాహరణకు:** ఒక వ్యక్తి A, B అనే పొదుపు ఖాతాలను కలిగి ఉన్నాడని అనుకుందాం. ఖాతా Aకి 3.5 శాతం ప్రామాణిక వడ్డీ రేటు వచ్చిందనుకోండి. కొన్ని సార్లు పొదుపు ఖాతా Bకి 4 శాతం వడ్డీ లభించొచ్చు.

**3. భద్రత**

సాంకేతిక సమస్య వల్ల మీ సేవింగ్స్ ఖాతా ఆగిపోతే, మరో అకౌంట్ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లావాదేవీలను నిర్వహించుకోవచ్చు. అలాగే పొదుపు ఖాతాలో సొమ్మును ఉంచుకోవడం ద్వారా మన డబ్బుకు భద్రత ఉంటుంది.

**బహుళ పొదుపు ఖాతాలతో నష్టాలివే! మెయింటెన్ చేయడంలో కాస్త ఇబ్బందులు!**

బహుళ పొదుపు ఖాతాలు ఉండడం వల్ల వాటిని నిర్వహించడంలో కొందరు ఇబ్బంది పడుతూ ఉంటారు. బ్యాలెన్స్ లు, లావాదేవీలు, ఖాతా స్టేట్‌మెంట్స్ ను ట్రాక్ చేయడం ఇబ్బంది పడతారు. రెండు ఖాతాలను పర్యవేక్షించడం అంటే రెండు సెట్ ల స్టేట్‌మెంట్స్ పై నిఘా ఉంచడమే. అందువల్ల ఖాతాలు నిర్వహణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**అదనపు రుసుములు, ఛార్జీలు**

మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెన్ చేయకపోతే బ్యాంకులు రుసుములను వసూలు చేయవచ్చు. ఎక్కువ సేవింగ్స్ అకౌంట్లు ఉన్నప్పుడు అన్నింట్లో మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెన్ చేయలేకపోవచ్చు. దీంతో పెనాల్టీలు తప్పవు. ఒకే బ్యాంకులో రెండు పొదుపు ఖాతాలను నిర్వహించడం వల్ల లాభనష్టాలు రెండూ ఉంటాయి. అందుకే బహుళ సేవింగ్స్ ఖాతాలను ఓపెన్ చేయడానికి ముందు మీ ఆర్థిక లక్ష్యాలు, ఖర్చులు, ప్రయోజనాలు, అవసరాలకు పరిగణనలోకి తీసుకోండి. మీరు రెండు ఖాతాలను మెయింటెన్ చేయగలరో లేదో నిర్ధరించుకోవాలి.

## ల్యాప్స్ అయిన ఎల్ఐసీ పాలసీని యాక్టివేట్ చేసుకోండి ఇలా..

**విశ్వంభర, బిజినెస్ :** ల్ఐసీ వినియోగదారుల కోసం దీర్ఘకాలిక పథకాలను అందిస్తుంది. అయితే ఎక్కువ కాలం పాటు మీ ప్రీమియంలను చెల్లించడం మానేస్తే.. పాలసీ రద్దు కావచ్చు. ల్యాప్స్ అయిన పాలసీని పునరుద్ధరించడానికి ఎల్ఐసీ రెండు సంవత్సరాల విండోను అందిస్తుంది. ఎల్ఐసీ ఏజెంట్ లేదా బ్రాంచ్‌ని సందర్శించడం ద్వారా పాలసీదారు పునరుద్ధరణ చేయవచ్చు. వివిధ కారణాల వల్ల ప్రీమియంలు చెల్లించలేకపోవచ్చు లేదా వారి పాలసీని సరెండర్ కూడా చేయకపోవచ్చు. అటువంటి సందర్భాలలో, డబ్బు క్లెయిమ్ చేయని మొత్తంగా ఎల్ఐసీ వద్ద ఉంటుంది. క్లయిమ్ చేసుకోవచ్చు.. క్లెయిమ్ చేయని ఈ మొత్తాలను చెక్ చేసుకునే సదుపాయాన్ని ఎల్ఐసీ అందిస్తుంది. అందుకోసం ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఎలా తనిఖీ చేయాలంటే.. ఎల్ఐసీ అధికారిక వెబ్ సైట్లోకి వెళ్లి, కిందికి స్క్రోల్ చేయండి.. అక్కడ "అన్ క్లెయిమ్డ్ అమౌంట్స్ ఆఫ్ పాలసీ హోల్డర్స్" ఎంపికను ఎంచుకోండి. మీరు పాలసీ నంబర్, పాలసీదారు పేరు, పుట్టిన తేదీ,పాన్ కార్డ్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత, "సబ్మిట్" బటన్ క్లిక్ చేయండి. మీ పాలసీకి సంబంధించి ఏదైనా క్లెయిమ్ చేయని డబ్బు ఉంటే, అది స్క్రీన్‌పై ప్రదర్శితమవుతుంది. మీరు దానిని క్లెయిమ్ చేసుకోవచ్చు.



# బాలీవుడ్‌కు నేను సెట్ కాను

## కంగనా రనౌత్

**విశ్వంభర, సినిమా :** నేను బాలీవుడ్‌కు సెట్ అయ్యే వ్యక్తిని కాదు అని బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, ప్రస్తుత లోక్ సభ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. నిర్మొహమాటంగా తన అభిప్రాయాలు చెప్పడం ఈ భామకు అలవాటు. ఇక బాలీవుడ్ తీరుపై తరచూ విమర్శలు గుప్పిస్తుంటుంది. రాజకీయవేత్తగా అవతరించిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బాలీవుడ్ ప్రముఖులను తీసిపారేసినట్లు మాట్లాడింది. రాజ్ షమానీ పాడ్ కాస్ట్ లో మాట్లాడుతూ అనేక విషయాలే చెప్పింది. బాలీవుడ్‌లో 'మీకెవరైనా ఫ్రెండ్స్ ఉన్నారా?' అని అడిగినప్పుడు కంగనా ''నేను బాలీవుడ్ వ్యక్తినని అనుకోవడం లేదు. బాలీవుడ్ మనుషులతో నేను ఫ్రెండ్ గా కూడా ఉండలేను అయినా అలాంటి వారితో స్నేహం చేయడం ఏమిటి? ఎక్కడ ఏమి జరుగుతుందో కూడా వారికి తెలియదు. వారు దేని గురించి పెద్దగా చర్చించరు'' అన్నది. ''మొత్తం పరిశ్రమ అలా ఎందుకుంటుంది?'' అన్నప్పుడు కంగనా ''నేను బాలీవుడ్ ను చాలా చూశాను. బాలీవుడ్ ప్రముఖులు రోటీన్ గా ఉంటారు. ఒకవేళ షూటింగ్ లేకుంటే వారు ఉదయం లేవగానే ఎక్సర్సైజ్ చేస్తారు. మధ్యాహ్నం నిద్రపోతారు. తర్వాత లేచి జిమ్ కు వెళతారు. రాత్రిపూట పడుకోవడమో లేక టివి చూడ్డమో చేస్తారు'' అంది. ''వారు బ్రాండెడ్ బ్యాగులు, కార్లు, డైట్స్, ఎవరితో ఎవరు డేటింగ్ చేస్తున్నారు, ఏ జంట విడిపోయింది వంటి విషయాలే మాట్లాడుతుంటారు'' అంటూ చెప్పుకొచ్చింది. ''బాలీవుడ్ లో డీసెంట్ వ్యక్తి నాకు కనిపించలేదు. బాలీవుడ్ పార్టీ అంటే నాకు ట్రౌమా వంటిది. ఆ పార్టీలన్నీ పైపై మెరుగులే. వారు బ్యాగులు, కార్లు గురించి తప్ప వేరే ఏ విషయాలపై మాట్లాడరు'' అంది. అయితే కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది నవంబరు 24న విడుదల కావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత జూన్ 14న విడుదల చేయానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ క్రమంలోనే కంగనా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం హిమచల్ ప్రదేశ్ 'మండి' నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటి చేసి గెలవడంతో రాజకీయల్లో బిజీ అయ్యి ఈ సినిమా మళ్లీ వాయిదా పడింది. తాజాగా ఈ సినిమాను దసరా కానుకగా సెప్టెంబర్ 06న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. అయితే విడుదల తేదీ దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్‌లో పాల్గోంటుంది కంగనా. ఈ క్రమంలోనే తాను ఎందుకు ఖాన్‌లు, కపూర్‌లతో సినిమాలు చేయనో వెల్లడించింది. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, ఆమీర్ ఖాన్‌లా సినిమాల నుంచి నాకు అవకాశం వచ్చినప్పుడు నేను రిజెక్ట్ చేశాను. అందరూ ఖాన్‌లతో నాకు మంచి రిలేషన్ ఉంది. వాళ్లు నాతో ఎప్పుడు తప్పుగా ప్రవర్తించలేదు. అయితే నాతో తప్పుగా ప్రవర్తించిన నటులు చాలా ఉన్నారు. అందులో ఖాన్స్ లేరు. కానీ నేను వారి చిత్రాలకు నో చెప్పాను, ఎందుకంటే వారి చిత్రాలలో హీరోయిన్ రెండు సన్నివేశాలతో అలాగే ఒక పాటలో కనిపించి వెళుతుంది. కాబట్టి నేను అలా చేయకూడదని నిర్ణయించు కు న్నాను. ఖాన్‌లతో పనిచేయకుండా ఏ లిస్ట్‌లో ఉన్న నటిగా నేను గుర్తింపు తెచ్చుకోవాలి అనుకున్నాను అందుకే నటించలేదు అని చెప్పుకొచ్చింది.



## మరోసారి జంటగా శివాజీ-లయ

**విశ్వంభర, సినిమా :** శివాజీ, లయ కాంబినేషన్లో వచ్చిన మిస్సమ్మ, టాటా బిర్లా మధ్యలో లైలా, అదిరిందయ్యా చంద్రం చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. దాదాపు ఒకటిన్నర దశాబ్దం తర్వాత ఈ జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. శివాజీ, లయ హీరోహీరోయిన్లుగా ఓ కామెడీ క్రైమ్ థ్రిల్లర్ మూవీ రూపుదిద్దుకోనుంది. ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. దర్శకుడికి ఇదే తొలి చిత్రం. శివాజీ ఈ చిత్రానికి నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. శివాజీ సొంత బ్యానర్ శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాదులో జరిగింది. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు క్లాప్ కొట్టారు. శివాజీ తనయుడు రిక్కీ కెమెరా స్విచాన్ చేశాడు. ఈ ఓపెనింగ్ సెర్మనీకి హాజరైన స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీను ముహూర్తం షాట్ కు దర్శకత్వం వహించారు. కాగా, ఈ సినిమాకు ఇంకా టైటిల్ ఫిక్స్ చేయలేదు. ఆగస్టు 20 నుంచి సెట్స్ పైకి వెళ్లనుంది. త్వరలోనే ఇతర తారాగణం వివరాలు ప్రకటించనున్నారు.

## బిగ్ బాస్ 8కి టాలీవుడ్ హీరో కమ్ కమెడియన్ ఎంట్రీ?

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్‌లో తనదైన కామెడీతో మంచి పేరు తెచ్చుకున్నయంగ్ యాక్టర్ అభినవ్ గోమఠం తాజాగా బిగ్ బాస్ తెలుగు 8వ సీజన్‌లో పాల్గొనబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న అభినవ్ గోమఠం.. ఆ తర్వాత 'మస్తు షేడ్స్ ఉన్నాయి రా', 'మై డియర్ దొంగ',కిస్మత్, సేవ్ ది టైగర్స్ వంటి సినిమాల్లో హీరోగా నటించాడు. దీని కంటే ముందు అగ్ర హీరోల సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానూ మెప్పించాడు. ప్రెజెంట్ కామెడీ రోల్స్ కు దూరమై సీరియస్ రోల్స్ చేస్తున్నాడు. తాజాగా బిగ్‌బాస్ టీమ్ అభినవ్ ను సంప్రదించినట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అతను కనుక బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంటర్ అయితే హౌస్ లో అన్ లిమిటెడ్ ఫన్ గ్యారెంటీ అని నెటిజన్స్ అంటున్నారు. కాగా దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అభినవ్ గోమఠం బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంటర్ అవుతారా లేదా అనేది తెలియాలంటే మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే. మరోవైపు బిగ్ బాస్ సీజన్- 8 సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. నాగార్జున హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే ప్రోమోలు విడుదలై మంచి ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.





# సీరియల్ నటి సూపర్ హాట్ షో..

**విశ్వంభర, సినిమా :** గుప్పెడంత మనసు సీరియల్‌తో నటి జగతి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జగతి తల్లీ కొడుకుల మధ్య వచ్చే మదర్ సెంటిమెంటే ఈ సీరియల్‌కి ప్రధాన భూమిక. అయితే సీరియల్‌లో పద్ధతిగా చీరకట్టి చాలా హుందాగా కనిపించే జ్యోతి రాయ్ సోషల్ మీడియాలో మాత్రం యమా హాట్‌గా ఫార్టీ ప్లస్‌లో కూడా కళ్లు జిగేల్‌మనిపించే ఫిజిక్‌తో పాతికేళ్ల అమ్మాయిలకు పోటీ ఇస్తుంది. ఈ మధ్య కాలంలో తన గ్లామర్ సోకులకు మరింత పదును పెట్టి జగతి మేడమ్.. కుర్రాళ్ల మతులు పోగొట్టే ఫొటోలు పోస్టు చేసింది. ఈ ఫొటోలు పోస్టు చేసిన కొద్ది సమయంలో తెగ వైరల్ అయిపోయాయి. అదిగో మహేంద్ర సార్ సైతం వారెవ్వా అంటూ అణుబాంబ్‌లతో ఈ సెక్సీ సుందరిని పోల్చుతున్నారంటే.. అమ్మడి ఆరబోత ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. జగతి అందాలను ఆరబోస్తూ ఫొటోలు వదలడంతో.. గుప్పెడంత మనసు సీరియల్‌లో ఈమెకి పెయిర్‌గా నటించిన మహేంద్ర.. అలియాస్ సాయి కిరణ్.. కొంటె కామెంట్ చేశారు. జగతిని మిస్ అయ్యి చాలా బిగ్ మిస్టేక్ చేశాడంటూ తనపై తానే జోక్ పేల్చుకున్నాడు మహేంద్ర. అతను అనడం కాదు.. జగతి మేడమ్ మాత్రం అణుబాంబే.. అందాలను ఆరబోయడంలో. ఇక గుప్పెడంత మనసు సీరియల్ విషయానికి వస్తే.. దాదాపు నాలుగేళ్ల పాటు బుల్లితెర ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకున్న ఈ సీరియల్‌కి శుభం కార్డ్ వేసేయనున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ కాగా.. ఈవారంతో గుప్పెడంత మనసు సీరియల్‌కి ఎండ్ కార్డ్ వేయబోతున్నారు. రిషి రీ ఎంట్రీతో ఈ సీరియల్‌కి మంచి రేటింగ్ వస్తుంది. రిషి, వసుధారలు తిరిగి కలసుకోవడంతో.. ఆసక్తికరంగా సాగుతుంది ఈ సీరియల్. అయితే అనూహ్యంగా.. సీరియల్‌కి మంచి రేటింగ్ వస్తున్నప్పుడు.. జనాలు ఆదరించే టైంలో ముగింపు పలికి గుప్పెడంత మనసు సీరియల్ ఫ్యాన్స్‌కి గట్టి షాకే ఇచ్చింది స్టార్ మా.

# కంటి చూపును పెంచే ఆహారాలు



**విశ్వంభర, ఫీచర్ :** 'సర్వేంద్రియానం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. అంటే.. అన్ని ఇంద్రియాలకంటే కళ్లే ముఖ్యమైనవని అర్థం. అయితే, మనం కళ్ల విషయంలో చాలా అజాగ్రత్తగా ఉంటాం. ముఖ్యంగా ఈ స్మార్ట్‌ఫోన్ల యుగంలో కళ్ల ఆరోగ్యం దయనీయంగా మారింది. రాత్రింబవళ్లు.. కాంతులు వెదజల్లే తెరలను చూస్తూ కళ్లకు అలసట కలిగిస్తున్నాం. రాత్రి నిద్రపోయేప్పుడు కూడా కళ్ల ముందు స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. అలాగే, టీవీలు, ట్యాబెట్లతో గడుపుతూ కనీసం విశ్రాంతి కూడా ఇవ్వడం లేదు. వర్క్ ఫ్రం హోం చేసేవారి పరిస్థితి కూడా దయనీయంగా మారింది. ఆఫీసులో కంటే.. ఎక్కువ సమయం ఇంట్లో ల్యాప్‌టాప్‌లను చూసేందుకే కేటాయించడం వల్ల కళ్లపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యంతోపాటు కళ్లను సైతం కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఈ కింది సూపర్ ఫుడ్స్‌ను తీసుకోవడం ద్వారా మీ కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం...

**చిక్కుళ్లు లేదా బీన్స్:** చిక్కుళ్లు, కిడ్నీ బీన్స్, కాయధాన్యాలు గురించి మీకు తెలుసా? వీటిని మీరు తప్పకుండా మిస్ కాకుండా తీసుకోండి. ఇందులో ఉండే బయోఫ్లావనాయిడ్స్, జింగ్ మీ రెటీనాను కాపాడతాయి. కంటిశుక్లం అభివృద్ధి చెందే ప్రమాదాన్ని, కంటి నల్ల మచ్చలను తగ్గిస్తాయి.

**నట్స్, సన్ ఫ్లవర్ విత్తనాలు:** కళ్లు ఆరోగ్యం ఉంచడంలో నట్స్ కీలక పాత్ర పోషిస్తాయి. వాల్‌నట్స్, బాదం, పిస్తా వంటి నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్-ఇ ఉంటాయి. ఇవి మీ కంటి ఆరోగ్యాన్ని పెంచుతాయి. పోషకాలతోపాటు విటమిన్-ఇ తీసుకోవడం వల్ల ఏజ్ రిలేటెడ్ మస్క్యులర్ డీజనరేషన్ (AMD) సమస్య తగ్గుతుందని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

**పచ్చని ఆకు కూరలు:** పిల్లలకు బాల్యం నుంచే ఆకు కూరలు తినడం అలవాటు చేయాలి. అప్పుడే వారి కళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. బచ్చలి, కాలే, కొల్లార్డ్ గ్రీన్స్ వంటి ఆకు కూరల్లో విటమిన్-సి, ఇ అధికం. మొక్కల్లాంటి ఆకు కూరల్లో విటమిన్-ఎ శాతం ఎక్కువ. కాబట్టి.. మీరు తీసుకొనే డైట్‌లో తప్పకుండా ఆకు కూరలు ఉండేలా చూసుకోండి. దీనివల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. వయస్సు మీదపడినా సరే కంటి చూపు మందగించదు.

**రంగు రంగుల కాయగూరలు, పండ్లు:** మన కళ్లు ప్రకాశవంతమైన దృశ్యాలను చూసినప్పుడు మెదడుకు సరైన సిగ్నళ్లను పంపుతాయి. క్యారెట్, టమోటో, పెప్పర్స్, స్ట్రాబెర్రీస్, గుమ్మడి, మొక్క జొన్నల్లో విటమిన్-ఎ, విటమిన్-సి ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటి సమస్యలను దరిచేరకుండా కాపాడతాయి.

**పండ్లు:** పుల్లని పండ్లలో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. ఆరెంజ్, ద్రాక్ష పండ్లు, నిమ్మ, బెర్రీస్‌లో ఇది లభిస్తుంది. ఇది కంటిశుక్లం, మాక్యులర్ క్షీణత సమస్య దరిచేరకుండా కళ్లను కాపాడుతుంది. ఇకపై మీ డైట్‌లో తప్పకుండా ఇవి ఉండేలా చూసుకోండి.

**చిలకడదుంప:** తియ్యటి రుచి కలిగిన చిలకడదుంపల్లో బీటా కెరోటిన్, విటమిన్-ఏ అధికంగా ఉంటాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కళ్లను కాపాడేందుకు ఇవి చక్కగా సహాయపడతాయి. చిలకడ దుంపలను మీ డైట్ ప్లాన్‌లో చేర్చుకోవడం వల్ల సహజమైన కంటి ఆరోగ్యాన్ని పొందడమే కాకుండా రేచీకటి సమస్యకు దూరంగా ఉండచ్చు.

**రెడ్ క్యాప్సికమ్ :** విటమిన్-ఏ, విటమిన్-సీ రెడ్ క్యాప్సికమ్‌లో అధికంగా ఉంటాయి. కళ్లలోని రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడటంలో, కంటి శుక్లాల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ విటమిన్-సీ చక్కగా సహాయపడుతుంది. వీటిలోని విటమిన్-ఏ మొత్తం కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**బ్రోకలీ :** బ్రోకలీలో విటమిన్-సీ, బీటా కెరోటిన్, లుటీన్, జియాంక్సంతిన్ ఎక్కువ మొత్తంలో లభిస్తాయి. కంటిని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించేందుకు, వయసు సంబంధిత కంటి సమస్యల నుంచి కాపాడేందుకు ఈ పోషకాలు చక్కగా ఉపయోగపడతాయి.

**బ్రస్సెల్స్ మొలకలు :** విటమిన్-సీ, విటమిన్-కేతో పాటు లుటీన్, జియాంక్సంతిన్ లాంటివి బ్రస్సెల్స్ మొలకల్లో అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ వల్ల కంటి ఆరోగ్యానికి జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి. వీటిని తరచూ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగవుతుంది.

# వీటిని తింటే యవ్వనం మీసొంతం



**విశ్వంభర, ఫీచర్ :** నేటి కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న జీవన శైలి సమస్యల్లో అధిక బరువు ఒకటి. హఠాత్తుగా బరువు పెరగడం వెనుక నిర్దిష్ట కారణాల్లో.. విటమిన్ లోపం ప్రధాన కారణమని పరిశోధనలు చెబుతున్నాయి. అమెరికన్ కాలేజ్ ఆఫ్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. మానవ శరీరంలో విటమిన్ సి లోపం బరువు పెరుగుటకు దారితీస్తుందని 2005లో తెలిపింది. అందువల్ల ఫిట్ లుక్ పొందాలంటే ప్రతిరోజూ విటమిన్ సి ఉన్న ఆహారాన్ని అధికంగా తినాలి. ముఖ్యంగా ఈ కింది పండ్లు తీసుకుంటే బరువు సులువుగా తగ్గుతారు. పైగా నవ యవ్వనం మీసొంతం అవుతుంది కూడా. పైనాపిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది ఆహారం జీర్ణం కావడానికి బాగా సహాయపడుతుంది. ఈ పండు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో మంటను తగ్గిస్తుంది. బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. బొప్పాయిలోని ఈ గుణం శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నివారించడంలో ఈ ఫ్రూట్ కాంబినేషన్ బలేగా సహాయపడుతుంది. బరువు కూడా తగ్గొచ్చు. కివి.. అధిక ఫైబర్ పండు. అన్ని సీజన్లలో అందుబాటులో ఉంటుంది. ఫైబర్ బరువు తగ్గడానికి గ్రేట్ గా సహాయపడుతుంది. కివీలోని విటమిన్ సి గుండె జబ్బుల ప్రమాదాన్ని బాగా తగ్గిస్తుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. జామపండు విటమిన్ సి మాత్రమే కాకుండా ఖనిజాలు, పొటాషియం, ఇతర మూలకాలను కలిగి ఉన్న పండు. ఇది శరీర పోషణలో ఎంతో సహాయపడుతుంది. స్ట్రాబెర్రీలను రోజువారీ ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. స్ట్రాబెర్రీలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com